23న జిల్లా అభివృద్ధిపై రౌంట్‌టేబుల్ సమావేశం

విశాలాంధ్ర-కడప రూరల్ : ఐదు సంవత్సరాల జగన్ పాలనలో కుంటుపడిన కడప జిల్లా అభివృద్ధిపై డిసెంబర్ 23న కడప ప్రెస్ క్లబ్ లో జరుగు రౌండ్ టేబుల్ సమావేశం జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి నాలుగు దశాబ్దాలుగా రాజకీయ జీవితాన్ని ప్రసాదిస్తున్న కడప జిల్లా అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తానని తన తండ్రి ఆశయాలను నెరవేరుస్తానని నమ్మబలికి ఓట్లు దండుకొని అసెంబ్లీ పార్లమెంటు స్థానాలను అన్నీ కైవసం చేసుకున్నారన్నారు. సొంత జిల్లా వాసి ముఖ్యమంత్రి అయితే జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తారన్న ప్రజల ఆకాంక్షను నెరవేర్చడంలో జగన్ ఘోరంగా విఫలమయ్యారన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేదు, పారుదల ప్రాజెక్టు -2లో



విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

సోమవారం 18, డిసెంబర్ 2023 | 8 పేజీలు

వైభవంగా శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహా ఆవిష్కరణ

హజరైన అతిరథ మహారథులు

విశాలాంధ్ర-మదనపల్లి రూరల్: దక్షిణ భారత దేశాన్ని పరిపాలించిన చక్రవర్తులలో శ్రీకృష్ణ దేవరాయలు కీర్తి దశదిశలా వ్యాపించి నేటికి చరిత్రలో నిలిచిపోయిందని రాష్ట్ర మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లె రూరల్ మండలం బసినకొండ పంచాయతీ, పుంగనూరు రోడ్డు నందు బలిజ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ దేవరాయలు కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కైవారం పీఠం ధర్మకర్త ఎం.ఎస్.జయరామయ్య, మదనపల్లె ఎమ్మెల్యే ఎం.నవాజ్ బాషా, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే జంగాలపల్లె శ్రీనివాసులు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, మాజీ టిటిడి పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, డీకే తేజస్వినిలు విచ్చేశారు. అతిథులను మదనపల్లె బలిజ జేఏసి నాయకులు సాదరంగా ఆహ్వానించారు. ముందుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా -2లో

రాజంపేటలో టీడీపీ అభ్యర్థి ఎవరు.!

- ఎవరికి వారు అభ్యర్థి నేనేనంటూ జోరుగా ప్రచారం
- అయోమయానికి గురవుతున్న కార్యకర్తలు, అభిమానులు
- పలు నియోజకవర్గాల్లో ఇద్దరు ముగ్గురు ఆశావహులు
- గ్రూపు రాజకీయాలు ప్రోత్సహిస్తున్న నేతలు
- కష్టపడే వారికే టిక్కెట్లు ఇవ్వాలంటున్న పసుపు శ్రేణులు
- ఆశావహుల వడపోతలో టీడీపీ అధిష్టానం

విశాలాంధ్ర -రాజంపేట : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ఇప్పటి నుంచే పావులు కదుపుతోంది. అయితే రాజంపేట టీడీపీ నేతల వ్యవహార శైలిపై అధినేత చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రాజంపేటలో టికెట్ ఆశిస్తున్న నేతలు పార్టీ కార్యక్రమాలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో కార్యకర్తలను, నాయకులను సమన్వయం చేసుకుంటూ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరికి వారే.. యమునా తీరే అన్నట్లుగా పార్లమెంట్ కేంద్రమైన రాజంపేట టిడిపి నేతలు వ్యవహరిస్తుండడంతో కార్యకర్తలు, అభిమానులు అయోమయానికి గురవుతున్నారు. అధినేత చంద్రబాబు నాయుడు రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి ఎవరు అన్నది ప్రకటించకపో వడంతో ఎవరికి వారు వర్గాలుగా ఏర్పడి పార్టీ కార్యక్రమా లను నిర్వహిస్తు, వచ్చే ఎన్నికల్లో తమనే గెలిపించాలని ముమ్మరంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తు ప్రజలకు హామీలు ఇస్తున్నారు. ఇందుకు నిదర్శనమే ఆదివారం ప్రముఖ పారిశ్రామికవేత్త గంటా నరహరి ఆధ్వర్యంలో నిర్వహించిన ముస్లిం మిలాఖత్ కార్యక్ర మం అని చెప్పడంలో సందేహం లేదు. నియోజ కవర్గ కేంద్రమైన రాజం పేటలో జరిగిన మిలాఖత్ కార్యక్రమంలో పాల్గొన్న మైనార్టీలు, హిందువులు గంటా నరహరి చీరలను పంపిణీ చేశారు. ఒకవైపు గంట నరహరి మాట్లాడు తుండగానే మరోవైపు మహిళలు కుర్చీలను ఖాళీ చేసి భోజనాల వైపు వెళ్లడం విమర్శలకు దారి తీస్తోంది. అంతే కాకుండా ఈ కార్యక్రమానికి టిడిపి ముఖ్య నేతలు హాజరు కాకపోవడంతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు అయోమయానికి గురవుతున్నారు. రాజంపేటలో కేడర్ బలంగా ఉన్నప్పటికీ నేతల మధ్య సఖ్యత కనిపించక పోవడంతో విమర్శలకు దారి తీస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటువంటి తరుణంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అధికారాన్ని కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో అధినేత చంద్రబాబు ముందుకు వెళుతుంటే.. ఉమ్మడి అన్నమయ్య జిల్లా రాజంపేటలో -2లో

చెరువులను తలపిస్తున్న ప్రధాన రహదారులు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండల కేంద్రం నుండి జూనియర్ సివిల్ కోర్టు మీదుగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారిలో గుంతలు ఏర్పడటంతో ప్రజలు, గ్రామీణ ప్రాంతాల నుండి కోడూరు టౌన్ కు వెళ్ళే ప్రజలు, విద్యార్థులు, వృద్దులు నరకం అనుభవిస్తున్నారు.ఎటు చూసినా గోతులు, చిన్న పాటి వర్షం పడిందంటే చాలు అ గుంతల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి.ఈ రోడ్డులో ప్రయాణించాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. రోడ్లు గుంతలమైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డంతా బురదమయంగా మారిపోతుంది.బురదలో మోట ర్ బైక్ లు స్లిప్ అయ్యి జారిపడి గాయాలకు గురౌతున్నారు.దీంతో రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.దెబ్బ తిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు అదికారుల దృష్టికి, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రైల్వేకోడూరు మంగంపేట ఏరియా నుండి రైల్వేకి కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా దెబ్బ తిన్న రోడ్ల గురించి పట్టించుకోక పోవడం దారుణమని ప్రయాణికులు, వాహన దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.5 గ్రామపం చాయతీలు ఉల్లగట్టుపోడు, ఎ.బుడుగుంటపల్లి, విపిఆర్ ఖండ్రిక, సూరపు రాజుపల్లి గంగురాజు పోడు గ్రామపంచాయితీల పరిధిలో సుమారు 100 గ్రామాలు, ఎస్సీ ఎస్టీ బీసీ కాలనీలు ఉన్నాయి.సింగిల్ రోడ్డు కావడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు సైడ్ పోవాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.దీంతో వాహనాలు రోడ్డు పైకి రావాలంటే భయాం దోళనకు గురవుతున్నారు.ఏ ప్రమాదం ఎటు నుంచి వస్తుందో తెలియని అయోమయ పరిస్థితి లో ఉన్నారు.నిత్యం ఇదే దారిలో అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా మాకెం దుకులే అనే నిర్లక్ష్య ధోరణిలో ఉన్నారు. ఆనారోగులు -2లో

తాళాలు బద్దలు కొట్టే అధికారం..

జగన్ రెడ్డికి ఎవరు ఇచ్చారు : టిడిపి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : అంగన్వాడి సెంటర్ల బీగాలను పగులకొట్టె అధికారం జగన్ రెడ్డికి ఎవరు ఇచ్చారని తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం టిడిపి ప్రధాన కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీగాలను ప్రభుత్వమే పగులకొట్టే విధానం రాజ్యాంగంలో ఉందా అని ప్రశ్నించారు. అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించమని అడగడం తప్పా అని ముఖ్యమంత్రిని నిలదీశారు. ముఖ్యమంత్రి రాజ్యాంగాన్ని ఉల్లంఘించి మాట్లాడడం తగదన్నారు. సమస్యలు పరిష్కరించమని అడిగే హక్కు అంగన్వాడి కార్యకర్తలకు ఉందన్నారు. జగన్ రెడ్డి అసమర్ధ పాలనతో వ్యవస్థలన్నింటిని భ్రష్టు పట్టించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్ అమూల్‌పై ఉన్న మమకారం అంగన్వాడీలపై లేదని తీవ్రంగా విమర్శించారు. అంగన్వాడీలు ప్రభుత్వాన్ని కొత్తగా ఏమీ డిమాండ్ చేయలేదన్నారు. ఎన్నికల సందర్భంగా జగన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయమని అడుగుతున్నారే తప్ప మరేమీ అడగలేదన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు, రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని వేతనంలో సగం పింఛనుగా ఇవ్వాలని అడుగుతున్నారన్నారు. అంగన్ వాడి సంఘాల నాయకులను చర్చలకు పిలిచి తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అన్న చందంగా ప్రభుత్వం వ్యవహరించడంతో చర్చలు ఏమాత్రం ముందు సాగడంలేదన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే టిడిపి అంగన్‌వాడిలకు అండగా నిలబడి ఉద్యమిస్తామని జగన్ రెడ్డిని హెచ్చరించారు. సయ్యద్ మెహతాజ్ బేగం, పులెల రమేష్ బాబు, గడికోట సుబ్బరాయుడు, కొమ్మా శివ,విజయవర్మ, బుంగటావుల రాజశేఖర్, సయ్యద్ మహమ్మద్ జిక్రి, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఘన సన్మానం

విశాలాంధ్ర-పులివెందుల: స్థానిక పెన్షన్ దారుల సంఘం భవనంలో ఆదివారం సీనియర్ పెన్షనర్లకు ఘన సన్మానం లభించింది. పెన్షనర్ల దినోత్సవం పురస్కరించుకుని పులివెందుల పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 70, 80సంవత్సరాల వయసు పూర్తయిన దాదాపు 22 మంది సీనియర్ సర్వీసు పెన్షనర్లను సత్కరించారు. ప్రతి ఏటా డిసెంబరు 17వ తేదీన సీనియర్ సర్వీసు పెన్షనర్లను సన్మానించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో విశ్రాంత అధ్యాపకులు రామసుబ్బారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ సర్వీసు పెన్షనర్లతో పాటు వారి కుటుంబ సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా పెన్షనర్లకు ఆరాధ్యులైన డిఎస్ నకార చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. పెన్షనర్లకు ఉన్న సాధకబాధలు, సమస్యల పరిష్కారానికి సంఘం చేస్తున్న కృషి, సభ్యత్వ నమోదు ఆవశ్యకత తదితర అంశాలను పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి విపులంగా వివరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రంగారెడ్డి, మునిరెడ్డి, డివి కొండా రెడ్డి, నారాయణరెడ్డి, సివిరంగారెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

బిసి వసతి గృహ విద్యార్థినీలకు వైద్యపరీక్షలు

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణం అంకాలమ్మ పేటలోని బిసి సాంఘిక సంక్షేమ బాలికల సవతి గృహంలో ఆదివారం విద్యార్థినీలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూత్రాలను వివరించారు. అలాగే వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను వైద్యులు విద్యార్థినీలకు వివరించారు. వైద్యులు సలహాలు సూచనలు తప్పక పాటించాలని వారికి తెలియ జేశారు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తే ఎలాంటి వ్యాధులు దరిచేరవని వైద్యులు వెల్లడించారు. కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలరు కొండలరావు, వైద్యురాలు స్నేహ ప్రత్యూష, డాక్టర్ బాలనారాయణ రావు, ఎపిఆర్‌వో ఆనందరావు, డిగ్రీ కళాశాల ఉమెన్స్ హాస్టల్ వార్డెన్ నాగసుబ్బమ్మ, నర్సు సుజాత, ఆశావర్కర్లు, ఖాదర్‌బాషా, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీలోకి పలువురి చేరిక

విశాలాంధ్ర-కడప రూరల్ : మున్సిపల్ ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఏఐటియుసి అనుబంధ సంస్థ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ముందు భాగంలో ఉంటుందని అందుకు ఆకర్షితులై కడప నగర పాలక సంస్థ పరిధిలో మేస్త్రీలు చేరడాన్ని వారికి కండువాలు కప్పి స్వాగతిస్తున్నామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జి వేణుగోపాల్ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కే.సి.బాదుల్లా,అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, తారకరామారావు తెలిపారు. ఆదివారం స్థానిక హోచిమిన్ భవన్ యందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రావడం కోసం ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చారు. కానీ, అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా నేటికీ అమలు చేయలేదన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని మరచిపోయారని మండిపడ్డారు. మేస్త్రి లకు ఇవ్వాల్సిన డ్రస్ అలవెన్స్ ఇవ్వకుండా విధుల సమయంలో వేధింపులకు గురిచేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఈశ్వరయ్య, మేలంగి రాజశేఖర్, వెంకటాద్రి మేస్త్రీలు ఆదాము,మధుసూదన్, రాజేంద్ర,శివ, శ్రీనివాసులు స్వరూప్,శ్రీకాంత్, ప్రసన్న, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

20న కారు వేలం

విశాలాంధ్ర- రామాపురం : అక్రమ మద్యం కేసులో పట్టుబడిన కారును ఈనెల 20వ తేదీ బుధవారం ఉదయం 10-30 గంటలకు వేలం వేస్తున్నట్లు ఎస్సై కొండారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 10:30 కు రామాపురం పోలీస్ స్టేషన్ ఎదుట కారు వేలంపాట బహిరంగ వేలము నిర్వహిస్తున్నామని. అవసరం ఉన్నవారు ఈ వేలంపాటలో పాల్గొన్న వచ్చునని ఆయన అన్నారు.

అన్నమాచార్యలో పూర్వ విద్యార్థుల సమావేశం

విశాలాంధ్ర -కడప కలెక్టరేట్: స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను, తీపి గుర్తులను గుర్తు చేసుకున్నారు. పాత స్నేహితులందరూ మళ్లీ ఒకసారి కలుసుకోవడం చాలా ఆనందదాయకమని వారు పేర్కొన్నారు. ఇలాంటి అరుదైన అవకాశాన్ని కల్పించిన అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల అధినేత చొప్ప గంగిరెడ్డి మరియు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువును నేర్పించి, కర్తవ్య దీక్షను మాలోన మెల్కొలిపి, సత్ఫలితాలలో సమాజంలో గౌరవ ప్రతిష్ట లు పెరిగేలా చేసిందన్నారు. ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల స్థాపించి దాదాపు 13 సంవత్సరాలు అయినందువలన పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడి తమ విద్యార్థులను ఇలా సమావేశం కావడం తమకెంతో ఆనందదాయకం అన్నారు. విద్యార్థిని విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషి చేసిన డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని విద్యార్థులు అన్ని విభాగాధిపతుల అధ్యాపకులు ఆధ్యాత్మికత సిబ్బంది అభినందించారు.

వైభవంగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి) శ్రీకృష్ణ దేవరాయలు సర్కిల్ కు రిబ్బన్ కట్ చేశారు. అనంతరం విగ్రహాన్ని ఆవిష్కరించి, నిలువెత్తు పూల మాలలు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయులు గొప్ప పరిపాలన దక్షుడన్నారు. మదనపల్లె డివిజన్ పరిధిలో ఎక్కడైనా శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలు ఏర్పాటు చేయాలనుకుంటే తమవంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం కైవారం పీఠం ధర్మకర్త ఎం.ఎస్. జయరామయ్య శ్రీకృష్ణ దేవరాయల పాలనను స్వర్ణయుగం అని అభివర్ణించారు. ఎమ్మెల్యే నవాజ్ బాషా మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయులు గొప్ప పాలకుడే కాకుండా స్వయానా కవి అన్నారు. జంగాలపల్లె శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయలు ఎన్నో గ్రంథాలు రచించారని, అందులో ఆముక్తమాల్యద గ్రంథం ఎంతో ప్రసిద్ధిగాంచిందన్నారు. దేశ భాషల యందు తెలుగు లెస్స అని కీర్తించారని గుర్తు చేశారు. విగ్రహ ఏర్పాటుకు సహకరించిన దాతలను బలిజ జేఏసి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె బలిజ జేఏసీ కన్వీనర్ వై.యస్. మునిరత్నం, సభ్యులు, బలిజ సంఘం నాయకులు కత్తి రాజు, బోరు వెల్ నాగరాజ, ఆంజనేయ కుమార్, బీవీ రమణ, ఆకుల కృష్ణమూర్తి, చంద్ర శేఖర్,అండే శివ ప్రసాద్, ప్రసాద్, జయరాం, భాస్కర్, కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి, జంగాల శివ రామ్ రాయల్, ప్రసాద్, వెంకటేష్, రామచంద్ర పాల్గొన్నారు.

రాజంపేటలో టీడీపీ అభ్యర్థి ఎవరు?

(మొదటి పేజీ తరువాయి) పార్టీ నేతలు వెనకడుగువేస్తున్నారు. బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ, యువగళం వంటి కార్యక్రమాలతో చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్ ప్రజల్లోకి వెళ్లి 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. అయితే కేడర్ బలంగా ఉన్న రాజంపేటలో అభ్యర్థుల వర్గ పోరుతో టీడీపీ డీలా పడటం అధిష్టానాన్ని కలవరపెడుతోంది. ముఖ్యంగా రాష్ట్ర రాజకీయాలనే శాసించే రాజంపేటలో పార్టీని బలోపేతం చేయాలన్న చంద్రబాబు ప్రయత్నాలు సఫలం కావడంలేదనే అభిప్రాయం వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దూకుడు పెంచింది. అయితే రాజంపేటలో తెలుగు తమ్ముళ్ళు గ్రూపు రాజకీయాలతో మొక్కుబడిగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని అధినేత దృష్టికి వెళ్లినట్లు సమాచారం. దీంతో కష్టపడి పని చేసే వారికే వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇస్తామని ఇటీవల చంద్రబాబునాయుడు జిల్లా నేతలకు స్పష్టం చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అందరూ సమిష్టిగా పార్టీ విజయం కోసం పని చేయాలంటూ గతంలో దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇటీవల టిడిపి, జనసేన నేతలు ఉమ్మడి విస్తృతస్థాయి సమావేశం నిర్వ హించారు. పార్టీ విజయం కోసం సమిష్టిగా పని చేస్తామంటూ ప్రకటించారు. మరోవైపు వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో పలు సర్వేల ఆధారంగా టికెట్లను కేటాయించనున్నట్లు సమాచారం. తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం అభ్యర్థుల ఎంపికలో అనేక వడపోతలు చేస్తోంది. శాసనసభ ఎన్నికల బరిలో నిలిచే ఆర్థిక, అంగబలం ఉన్న అభ్యర్థుల కోసం అధిష్ఠానం జల్లెడపడుతున్నట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని బృందాలతో టీడీపీ అధిష్ఠానం గుట్టు చప్పుడు కాకుండా అన్ని నియోజకవర్గాల్లోనూ ఆరా తీస్తున్నట్లు సమాచారం. దీంతో ఎమ్మెల్యే టికెట్లు ఆశిస్తున్న నేతల్లో.. అధిష్ఠానం చేయిస్తున్న సర్వే గుబులు రేపుతోంది. అభ్యర్థుల విషయంలోనే గెలుపు గుర్రాల కోసం టికెట్టు ఆశిస్తున్న ఆశావహులను పరిశీలిస్తోంది.

23న జిల్లా అభివృద్ధిపై రౌండ్‌టేబుల్ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)పనుల్లో పురోగతి లేదు, మూతబడ్డ పరిశ్రమల పునరుద్ధరణ ఊసే లేదు, క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణం, ఐటీ పరిశ్రమ అటకెక్కించబడి, కడప - బెంగళూరు రైల్వే నిర్మాణం లేదు, కూలిపోయిన బ్రిడ్జిలకు, దెబ్బ తిన్న రోడ్లకు, తెగిపోయిన ప్రాజెక్టులకు మోక్షం లేదు. పట్టణాల్లో మౌలిక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు, సుందరీకరణకు నిధులు లేవు, దళిత, బహుజనులకు రక్షణ లేదు, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు, మాట్లాడే వారిపై ముందస్తు అరెస్టులు చేస్తూ ల్యాండ్, శాండ్, మైన్, వైన్ మాఫియాను పెంచి పోషిస్తున్నారన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం జిల్లా ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని వారు ఆరోపించారు. ప్రతి ఏటా క్రిస్మస్, వైయస్సార్ జయంతి వర్ధంతి వేడుకల సందర్భంగా జిల్లా పర్యటనకు రావడం వేసిన శిలాఫలకాలపైనే శిలాఫలకాలు వేసుకుంటూ జిల్లా ప్రజలను మభ్యపెడుతూ జిల్లాకు తీరని ద్రోహం తలపెట్టారని తీవ్రంగా విమర్శించారు. జగన్ వైఖరిని ఎండ కొడుతూ డిసెంబర్ 23న శనివారం కడప ప్రెస్ క్లబ్ లో జరుగు రౌండ్ టేబుల్ సమావేశానికి జిల్లా అభివృద్ధిని కాంక్షించే వారందరూ రావాలని వారు కోరారు.

ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్‌టీఎఫ్ నేతలు

విశాలాంధ్ర-పులివెందుల: తూర్పు రాయలసీమ (నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు) ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డిని ఆదివారం వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు కలిశారు. నెల్లూరులోని ఎమ్మెల్సీ కార్యాలయంలో తాము మర్యాదపూర్వకంగా కలిసినట్లు వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సికె వెంకటనాథరెడ్డి, ఆయన కుమారుడు చరణ్‌కుమార్‌రెడ్డి, ప్రకాశం జిల్లా వైఎస్సార్ టీఎఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణారెడ్డిలు ఈ సందర్భంగా వెల్లడించారు.

రూ.5కోట్లతో పార్క్ ఏర్పాటు

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామ పంచాయతీ లోని హౌసింగ్‌బోర్డు కాలనీలో దాదాపు 3ఎకరాలలో రూ.5కోట్లతో ఈ ప్రాంత ప్రజలకు అందమైన పార్కు ఏర్పాటుచేస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హౌసింగ్ బోర్డు కాలనీలో పార్క్ ఏర్పాటుకు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీ ప్రజలకు రూ.5కోట్లతో పార్క్ ఏర్పాటుచేయడం రాష్ట్రంలో ఏ నియోజికవర్గంలో జరిగుండదని అన్నారు. అలాగే జమ్మలమడుగు రోడ్డు రాచమల్లు కాలనీ వాసులకు రోడ్లు, కాలువలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. రాజుపాళెం మండలంలోని అర్కటవేముల-సోమాపురం గ్రామానికి చెందిన రైతులు పొలాలకు వెళ్లేందుకు కాజ్‌వేను త్వరలో ఏర్పాటు చేస్తున్నామని, ఈ మేరకు టెండర్ కూడ పిలవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి నరసింహారెడ్డి, వరికూటి ఓబుల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దేవిప్రసాదరెడ్డి, కొండయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ ఓబయ్య యాదవ్, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామమందిర అక్షింతల పంపిణీ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : అయోధ్య రామ మందిర అక్షింతల పంపిణీ కార్యక్రమంలో బద్వేల్ మాజీ శాసనసభ్యులు టి.జయరాములు పాల్గొని మాట్లాడారు. అయోధ్య రామ మందిరం అక్షింతలు మండలంలోని అన్ని గ్రామాలకు పంపిణీ చేసే కార్యక్రమం శ్రీ మలకత్త ఆంజనేయ స్వామి గుడిలో జరిగింది. సనాతన ధర్మాన్ని గురించి ప్రతి హిందువు తెలుసుకోవాలని, తన హైందవ ధర్మానికి జరిగే నష్టాలు పట్ల సంవేదన భావన కలిగి ఉండాలని, ప్రపంచ మానవాళిని ఉద్ధరించే ఉత్కృష్ట భావన హిందూత్వంలోనే ఉందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 40 గ్రామాల నుండి రామభక్తులు పాల్గొన్నారు. వారి వారి గ్రామాల కు అక్షింతలు స్వామి వారి ప్రతిమలు, కరపత్రాలు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో హిందుత్వ సంస్థల ప్రతినిధులు బాల రంగయ్య, బీవీ రమణయ్య, వెంకటరామిరెడ్డి కె రామకృష్ణారెడ్డి, సెట్టెం చెన్నయ్య, సి నాగేంద్ర,శివకుమార్ పాల్గొన్నారు.

.. ప్రధాన రహదారులు

(మొదటి పేజీ తరువాయి) ఆసుపత్రికి వెళ్లాలన్నా అవస్థలు పడుతున్నారు. వర్షపు నీరు రోడ్డు పైన నిలవడంతో గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక ప్రమాదాల భారిన పడుతున్నారు. ద్విచక్ర వాహన దారులు కైతే చుక్కలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని దెబ్బ తిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని వాహనదారులు,ప్రజలు కోరుతున్నారు.

ప్రవాసాంధ్ర భరోసా భీమా నమోదు చేసుకోండి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ప్రవాసాంధ్ర భరోసా భీమా ప్రవాసాంధ్రుల కుటుంబ సభ్యులకు భరోసాలాంటిదనీ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రులు తప్పకుండా ప్రవాసాంధ్ర భరోసాభీమా నమోదు చేసుకోవాలని ఎన్ఆర్ఐ గ్లోబల్ కన్వీనర్, ఎ పి ఎన్ ఆర్ టి ఎస్ ప్రెసిడెంట్ వెంకట్ మేడపాటి, డైరెక్టర్ బి.హెచ్.ఇలియాస్ లు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ 2024 జనవరి 15 నుండిప్రవాసాంధ్ర భరోసాభీమా కొత్త పాలసీ వస్తుందని ప్రీమియం డబ్బులు పెరిగే అవకాశం ఉన్నందున ఇప్పుడున్న ప్రీమియం 3 సంవత్సరాలకు గానుఉద్యోగ వలస కార్మికులకు 550 రూపాయలు అలాగే విద్యార్థులకు 180 రూపాయలు జనవరి 15 కు ముందు భీమా నమోదు చేసుకోవాలని కోరారు.ప్రవాసాంధ్ర భరోసాభీమా నమోదు చేసుకున్న వారెవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు 10 లక్షల రూపాయలు ఎ పి ఎన్ ఆర్ టి ఎస్ వారు ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా ఇప్పిస్తారనీ తెలిపారు. ప్రమాదం జరిగి ఇతర ఆపరేషన్ చేసుకున్న లక్ష రూపాయల వరకు చికిత్స కొరకు బిల్లులు ఇస్తే ఇన్సూరెన్స్ కంపెనీ వారి ద్వారా ఇప్పిస్తామని అన్నారు. మహిళలకుప్రవాసాంధ్ర భరోసాభీమా నమోదు చేసుకున్న 9 నెలల తర్వాత ప్రెగ్నెన్సీఅయి జనరల్ డెలివరీ అయితే 35 వేలు సిజేరియన్అయితే 50 వేలు ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా ఎ పి ఎన్ ఆర్ టి ఎస్ ఇప్పిస్తుందనీ చెప్పారు.విదేశాలలో ఏ సమయంలో ఏమౌతుందో మనకుతెలియదు. మనపై నమ్మకం పెట్టుకొని, మనపై ఆధారపడి ఉన్న కుటుంబాలు కష్ట పడకుండా విదేశాలలో ఉన్న ముఖ్యంగా గల్ఫ్ లో ఉన్న తప్పకుండాప్రవాసాంధ్ర భరోసాభీమా నమోదు చేసుకొని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించాలన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-గాలివీడు: వికసిత్ భారత్ సంకల్ప యాత్రను సద్వినియోగం చేసుకోవాలని యం.పి.డి. ఓ.శేఖర్ నాయక్ తెలిపారు. ఆదివారం మండలం లోని వెలిగల్లు గ్రామ సచివాలయం అవరణంలో సర్పంచ్ నఫిషా ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ శేఖర్ నాయక్ గ్రామ ప్రజాప్రతినిధులు ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, పోషణ్ అభియాన్, ఉజ్వల 2.0, పీఎం ఆవాస్ యోజన తదితర స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివక్షకు తావులేకుండా సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో 2047లోపు భారత్‌ను బాగా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి పేదవాని అభివృద్ధికీ అన్ని సదుపాయాలూ అందించాలనే ఉద్దేశంతో వివిధ విధానాలు, పథకాలను ప్రభుత్వం ప్రారంభి చిందనీ, ఒక పథకానికి 100 మంది లబ్ధిదారులుంటే 100 మందికీ ఆ పథకం చేరాలనే ఉద్దేశంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా గ్యారంటీ వ్యాన్ గ్రామ గ్రామానికీ వచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో వై.కా.పా.మండల యూత్ లీడర్ వెంకట్రామిరెడ్డి ,వై.కా.పా. నాయకులు మనోహర్ రెడ్డి,రమణా రెడ్డి,బావాఫక్రుద్దీన్, జాకీర్ భాషా ,ఖలీల్ పలు శాఖల అధికారులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన ముస్లిం మైనారిటీలు



విశాలాంధ్ర-రాయచోటిటౌన్: మదనపల్లి నియోజక వర్గం నుంచి కొంత మంది ముస్లిం మైనారిటీలను అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ అల్లాబాకష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మదనపల్లి నియోజకవర్గం నాయకులు రెడ్డి సాహెబ్ గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో కొందరు ముస్లిం మైనారిటీలు సయ్యద్ సమీర్, మహ్మద్ సలాం, మహమ్మద్ సమీ, మహ్మద్ భాషా, ఇమ్రాన్,శుభాష్, మొహిద్దీన్ లు పార్టీ లో చేరినారు.రాష్ట్రంలోనూ దేశంలోనూ కాంగ్రెస్ పార్టీ అంటే మంచి గుర్తింపు ఉందని ప్రజలు అనుకుంటున్నారని పార్టీలో చేరిన నాయక లు అంటున్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి నాయకులు డాక్టర్ ఎస్.కె భాషా, షేక్ మహమ్మద్ ఆలీ పాల్గొన్నారు.

బడుగు,బలహీన వర్గాల అభివృద్ధే టీడీపీ లక్ష్యం

విశాలాంధ్ర - మైలవరం : రాష్ట్రములోని బడు గు, బలహీన వర్గాల అభివృద్దే తెలుగుదేశం పార్టీ లక్ష్యం అని జమ్మలమడుగు టీడీపీ ఇంచార్జి భూపేష్, రాష్ట్ర కార్యదర్శి జంభాపురం రమణ రెడ్డి లు అన్నారు. ఆదివారం సాయంత్రం మండ లంలోని గుర్రప్పకోన, నేలనూతల, లింగా పురం గ్రామాలలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారం టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ముందుగా టీడీపీ నేతలు గుర్రప్ప స్వామిని దర్శించుకుని అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. భూపేష్, రమణ రెడ్డి లు మాట్లాడుతూ ఈ వైసీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలపైన దాడులు అధికమ య్యాయని అన్నారు. ఎప్పుడైనా బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడిన పార్టీ,వారికి రక్షణ కల్పిస్తూ వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని స్థాపించిన పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమే అన్నారు.తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు భవిష్యతుకు గ్యారంటీ లో భాగంగా మహిళలకు సంవత్సరానికి 3 సిలిం డర్లు మరియు ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్స రాలు నిండిన ప్రతి మహి ళకు నెలకు రూ.1500/- ,నిరుద్యో గులకు నిరుద్యోగ భృతి, పిల్లలను స్కూల్స్ కు పంపే తల్లులకు ఒక్కొక్కరికి రూ.15000/- రైతులకు రూ.20000/-, బీసీలకు రక్షణ చట్టం ఇలా సూప ర్ సిక్స్ పేరుతో మినీ మేనిఫెస్టో విడుదల చేశారని తెలిపారు .బడుగు బలహీనర్గాల ప్రజల అభివృద్ధిని ఆకాక్షించే తెలుగు దేశం పార్టీ సైకిల్ గుర్తు పై ఓటు వేసి ఎమ్మెల్యే గా భూపేష్ ను గెలిపించాలని రాష్ట్ర కార్యదర్శి రమణ రెడ్డి కోరారు. . ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణా రెడ్డి,మండల క్లస్టర్ ఇంచార్జి నెమలి రాజారెడ్డి, దోడియం టీడీపీ నేత రవీంద్రరెడ్డి, నక్కొనిపల్లె మహేశ్వర రెడ్డి,డియం రామయ్య,బాల గుర్రప్ప, బాల సుబ్రమణ్యం, మహేంద్ర, గంగాధర్, నాగరాజు, హరి,రమణయ్య, వెంకట స్వామి నాయక్,బాలయ్య, తానా నాయక్,యూనిట్ ఇంచార్జి అంకాల్ పాల్గొన్నారు.

ఈద్గాలను దత్తత తీసుకుంటా: గంటా నరహరి

మన్నూరు ఈద్గాకు రూ 10 లక్షలు విరాళం

విశాలాంధ్ర-రాజంపేట : రాజంపేట నియోజ కవర్గం లోని ఈద్గాలను దత్తత తీసుకుంటానని టీడీపీ నాయకులు ఘంటా నరహరి అన్నారు. ఆదివారం రాజంపేట ఈద్గాలో లో టిడిపి నేత గంటా నరహరి ముస్లిం మైనారిటీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భారీ ఎత్తున ముస్లిం మైనారిటీలు పాల్గొన్నారు.ఈ సమావేశంలో గంటా నరహరి మాట్లాడుతూ ఆత్మీయ సమావేశంలో ముస్లిం మైనారిటీలు భారీ ఎత్తున పాల్గొని జయప్రదం చేశారని అన్నారు. రాజంపేట లో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరాలన్నారు. ముస్లిం సోదరులకు అన్యాయం జరుగుతోందని, చంద్రబాబు ప్రకటించిన రంజాన్ తోఫా, దుల్హన్ ఆగిపోయిందని అన్నారు. ముస్లిం సోదరులు నిజాయితీ పరులని, వారికి తనతో పాటు టీడీపీ అండగా ఉంటుందని తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలో ఉన్న 50 ఈద్గాలు దారుణ పరిస్థితుల్లో ఉన్నాయని, నియోజకవర్గం లోని 50 ఈద్గాలను తాను దత్తత తీసుకుంటానని ప్రకటిం చారు. అనంతరం మన్నూరు ఈద్గా అభివృద్ధికి రూ 10 లక్షలు విరాళం ప్రకటించారు. ఉపాధి కోసం అరబ్ దేశాలకు వెళ్లిన యువతకు ఉద్యోగావ కాశాలు కల్పిస్తామని తెలిపారు. రాజంపేటలో మెడికల్ కలాశాల లేదని, పరిశ్రమలు లేవని, ఇక్కడ ఎలాంటి అభివృద్ధి లేదని అన్నారు. పారిశ్రామి కంగా రాజంపేటను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడి యువత అరబ్ దేశాలకు వెళ్లకుం డా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా కల్పించారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకు పోయి 2 సంవత్సరాల గడిచినా ఇంతవరకు నిర్మాణం చేపట్టలేదని రాష్ట్ర ప్రభుత్వ ధోరణిని ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రూరల్ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, పోలి సుబ్బారెడ్డి, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నష్టాలబాటలో పూదోట రైతులు

విశాలాంధ్ర-పులివెందుల: ఆరుగాలం కష్టించే అన్నదాతకు ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఏ సంట వేసిన దిగుబడి సక్రమంగా ఇళ్లు చేరుతుందన్న నమ్మకం రైతుల్లో సన్నగిల్లింది. ఎన్నో ఆశలు నింపుకుని సాగు చేసిన పూదోటలు సాగు రైతులకు కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉద్యాన, ఆహార, వాణిజ్య పంటలతో పాటు పూలసాగును కూడా రైతులు అలవరచు కున్నారు. నబంబరు నుంచి మార్చి వరకు పూలకు గిరాకీ ఉంటుంది. అక్టోబరు నుంచి మార్చి వరకు అంటే దసరా, దీపావళి, కొత్తసంవత్సరం, సంక్రాం తి, శివరాత్రి, ఉగాది పండుగలతో పాటు తిరునా ళ్లు, జాతరలు, చల్లముద్ద వేడుకలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో పూలకు గిరాకీ ఉంటుందని రైతులు ఆశిస్తారు. స్థానికంగానే కాకుండా సుదూర ప్రాంతాలకు కూడా పూలను ఎగుమతి చేస్తారు. ఈ క్రమంలో పులివెందుల నియోజకవర్గ పరిధిలోన సమారు రెండువేల ఎకరాలల్లో పాలసాగు చేసట్టినట్లు తెలు స్తోంది. మొలక అనంతరం నాలుగు నెలల తర్వాత పూలు కోతకు వస్తాయని రైతులు చెబుతు న్నారు. నెలపాటు పూలకోత ఉంటుందన్నారు. కానీ ఈ ఏడాది పూలకు గిట్టు బాటు ధర లభించలేదని సాగు రైతులు చెబుతు న్నారు. ఎకరా పూల సాగుకు రూ.1.25లక్షలు ఖర్చు వస్తుందన్నారు. కూల్లు, రవాణా తదితర ఖర్చులు తడిసిమోపెడంత కావడం తో పూలకు గిట్టుబాటు ధర లభించలేదని రైతులు తెలిపారు. వాతావరణం అనుకూలించకపోవడంతో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉందన్నారు. తెగుళ్ల నియంత్రణకు సస్యరక్షణ చర్యలు చేపట్టినా ఫలితం కనిపించలేదని రైతులు వెల్లడించారు. ప్రభుత్వం స్పందించి పూలసాగు చేసి ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల వంటి కారణాల వల్ల నష్టపోయిన రైతును ఆదుకోవా న్నారు. ఆ దిశగా దీర్ఘకాలిక రుణాలు లేదా వడ్డీలేని రుణాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

బద్వేల్ ప్రాంత ప్రజలకు అందుబాటులో శ్రీకృష్ణ హాస్పిటల్

విశాలాంధ్ర-బద్వేల్ : బద్వేల్ పట్టణం సిద్దవటం రోడ్డు బీజేఎస్ఆర్ కాలేజీ దగ్గర ప్రభుత్వ సీమాంక్ ఆసుపత్రికి వెళ్లే దారిలో శ్రీకృష్ణ హాస్పిటల్ బద్వేల్ చుట్టుపక్కల మండ లాల ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శ్రీకృష్ణ హాస్పిటల్ ప్రారంభోత్స వానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి పాల్గొన్నారు. అనంతరం హాస్పిటల్ గదులను అట్టారు మండల వైఎస్పీ అధ్యక్షు డు ముడమాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ ఇన్‌చార్జి పోతిరెడ్డి రెడ్డయ్యలచే ప్రారంభిం చారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మాట్లాడు తూ బద్వేల్ పట్టణంలో మొట్టమొదటగా సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ లో మద్దిగ మునిరెడ్డి ద్వారా వారి అన్న కుమారుడు డాక్టర్ శివశంకర్‌రెడ్డి ఎంబీబీ ఎస్, డీఎన్‌బి ఆర్థో, గైనకాలజిస్టు డా.లక్ష్మీ ప్రసన్నలను అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణా మమన్నారు. అనంతరం డాక్టర్లు మాట్లాడు తూ అత్యవసర చికిత్సలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని ఎన్ఐసీయూ సౌకర్యం కలదన్నారు. మా హాస్పిటల్ నందు గైనకాలజిస్టు సేవలు అందిస్తామని, ఆర్థోకు సంబందించి ఆపరే షన్ సౌకర్యం కలదన్నా రు. బద్వేల్ పట్టణ ప్రజలు మెరుగైన వైద్యం కోసం కడప, నెల్లూరు, తిరుపతి, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలకు గతంలో వెళ్లేవారని ఇప్పు డు బద్వేల్ పట్టణంలోనే శ్రీకృష్ణ హాస్పిటల్ అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి తెచ్చా మన్నారు. ఈ కార్యక్రమంలో బంధు మిత్రులు, శ్రేయోభిలా షులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-రాయచోటి: భార్యా ,పిల్లలు, బంధు వులు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి సన్నిధిలో సంతోషంగా అమ్మవారి మొక్కు తెచ్చుకొని తిరిగి వెళుతూ రోడ్డు ప్రమాదం లో ఆంజనేయులు (42) లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సంబేపల్లి మండలంలో చోటుచేసుకుంది .పోలీసుల వివరాల మేరకు చిన్నమండెం మండలం మల్లూరు గ్రామం ఎగువ గడ్డ హరిజనవాడకు చెందిన ఆంజనే యులు కుటుంబ సభ్యులతో ఆదివారం శ్రీ దేవరాయి నల్ల గంగమ్మ ఆలయం లో మొక్కు తీర్చుకు నేందుకు వచ్చినట్లు తెలిపారు. సంతోషంగా అమ్మవారి మొక్కు తీర్చుకొని ఆటోలో కుటుం బ సభ్యులందరినీ పంపించి తాను ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతూ రేగుడిగుంట వారి పల్లె సమీపం లోని గంగిరెడ్డి చెరువు వద్ద జాతీయ రహదా రిపై ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో. అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు .కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవడంతో బంధు వులు కుటుంబ సభ్యులు బోరుమని విలపిం చారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు .ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రారండోయ్ ..శిల్పారామం అందాలను చూద్దము రండి..

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణ శివార్ల లో ఏర్పాటు చేసిన శిల్పారామం అందాలు చూడాల్సిందే. ప్రకృతి రమణీయత సందర్శకులను ఆస్వాదిస్తోంది. చూడచక్కని వాతావరణం మళ్లీ మళ్లీ రమ్మంటోంది. ఇలా కనువిందు చేసే అద్భుదాలెన్నో శిల్పారామంలో ఒదిగిపో యాయి. ఒక్కసారి శిల్పారామం సందర్శిస్తే మళ్లీ చూడాల నిపించే కోరిక సందర్భకుల్లో కలుగుతుంది. ఇదంతా దివంగతనేత, ఉమ్మడి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చలువేనని స్థానికులు చెబుతున్నారు. పులివెందుల పట్టణ శివాలలో సుమారు 38 ఎకరాలలో శిల్పారామం ఏర్పాటు చేశారు. ఇందులో10 ఎకరాలు ఫంక్షన్ హాల్ పోతే మిగిలిన 28 ఎకరాలలో శిల్పారామం ఏర్పాటు చేశారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 2006-07 లో శిల్పారామం నిర్మాణానికి అంకుళార్పణ చేశారు. 2008 లో పూర్తిచేసుకున్న శిల్పారామాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు.

శిల్పారామం ప్రాముఖ్యత: పులివెం దుల పట్టణంలో ఏర్పాటు చేసిన శిల్పా రామం ఎంతో ప్రాముఖ్యతను చోటు చేసు కుంది. ప్రాచీన కాలం నాటి శిల్ప సంపద, నాగరికత సమాజము, వ్యవసాయము, వివిధ కులవృత్తుల ఆకృతులు, పచ్చదనం పరిశుభ్రత వంటి అంశాలు భావితరాలకు గుర్తుండేలా రూపొందిం చారు. రాష్ట్రంలో ప్రాచీన కలల కలలను ప్రోత్సహించడం శిల్పారామం ప్రత్యేకతను చాటు తుంది. రోజురోజుకు సందర్శికుల తాకిడి అధికమవు తోంది, ఆదివారం లేదా సెలవు దినాలలో సందర్శకుల తాకిడి కోలాహలంగా ఉంటుంది. పండుగలు పర్వదినాలు రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలల్లో భాగంగా ప్రత్యేక నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు.

సీఎం జగన్ హయాంలో మరింత అభివృద్ధి: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో శిల్పారామం మరింత అభివృద్ధి చెందింది. రూ.14.4 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులను ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఇందులో మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్ విత్ గ్యాలరీ, టాప్ టవర్ విత్ 16,5 అడుగుల దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం. హిల్ టాప్ పార్టీ జోన్, జిప్ లైన్ (రోప్ వే) బోటింగ్ ఐలాండ్ పార్టీ జోన్, ప్లే జోన్, వాటర్ పాల్, ఫుడ్ కోర్ట్, వీటితోపాటు ఐదు అడుగుల దివంగత నేత ఉమ్మడి మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కూర్చున్న విగ్రహంతో ఆకట్టుకునే ఎంట్రీ ప్లాజా, సీసీ రోడ్లు, పార్కింగ్ ఏరియా, ఆహ్లాదకర మైన గ్రీనరీ వంటి ప్రత్యేకతలు ఉన్నాయి. రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిన పులివెందుల శిల్పారామం ఒకసారి సందర్శిస్తే మళ్లీ మళ్లీ చూడాలనిపించే కోరిక సందర్శకుల్లో కలుగుతుంది. ఇదంతా దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చలువేనని యావన్మంది ప్రజలు కొనియాడుతున్నారు.

నేడు కలెక్టరేట్లో "జగనన్నకు చెబుదాం - స్పందన" కార్యక్రమం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 18న సోమవారం ఉదయం 10.00గం.ల నుండి "జగనన్నకు చెబుదాం - స్పందన" అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచిం చారు. ముఖ్యంగా.. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. అలాగే స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధిం చి ఎస్ఎల్ఏ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావా లని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మహావిష్ణు ఆలయంలో ఏకాదశి ఉత్సవాలు

విశాలాంధ్ర-రామాపురం : ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని ఈనెల 22 శుక్రవారం నుంచి 24వ తేదీ వరకు శ్రీదేవి భూదేవి సామెత మహావిష్ణు దేవస్థానంలోఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ముక్కోటి పసిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22వ తేదీన ఉదయం గంగా నయనం. గోపూజ. యాగశాల ప్రదేశం. శ్రీ మహాగణపతి పూజ స్వస్తి. అఖండ .దీపారాధన. ప్రధాన దేవత కలస్థాపన ఆరాధన మూలమూర్తులకు అభిషేకాలు అలంకరణ నేపథ్యం మహా మంగళహారతి తీర్థప్రసాదాలు వినియోగం ఉంటాయన్నారు. సాయంత్రం నుండి ప్రదోష పూజలు. అంకురార్పణ. అగ్ని ప్రతిష్ట. మహా సుదర్శన యోగం నవగ్రహ వస్తా హెూమం. మంగళహారతి తీర్థ ప్రసాదం అందిస్తామన్నారు. 23వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున మూలమూర్తుల ఉత్సవాలకు సుప్రభాత సేవ అభిషేకము. ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు మహావిష్ణు దర్శనం ఇవ్వడం జరుగుతుందన్నారు. 24న తేదీన శ్రీదేవి భూదేవి సామెత మహావిష్ణువు కల్యాణోత్సవం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాలు ప్రజలు కాకుండా ఇతర పట్టణాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని ఆయన అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్విని చేసుకోవాలని ఆయన అన్నారు.

రోడ్లపై గుంతలు పూడ్చిన ఆర్‌అండ్‌బి అధికారులు
విశాలాంధ్ర వార్తకు స్పందన



విశాలాంధ్ర-అట్లూరు : బద్వేల్-కడప ప్రధాన రహదారి కుంభగిరి చెరువు దగ్గర, బద్వేల్ మండలం వెంకటశెట్టి పల్లి దగ్గర, బైనపల్లి కమలకురు క్రాస్ వద్ద, బద్వేల్ మండలం భాకరాపేట వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో గుంతలు ఏర్పడి వాహనదారులకు చాలా కష్టంగా ఉంది. వాహనదారులు ఇబ్బం దుల విషయం అట్లూరు మండల ఎంపీపీ ఇంచార్జ్ పోతిరెడ్డి రెడ్డయ్య, కొల్లు వెంకట సుబ్బారెడ్డి, అగ్రహారం నర్సారెడ్డి, సింగన ఓబుల్ రెడ్డి, పొత్తపి పినరసింహలు పత్రికా మూలంగా విశాలాంధ్ర విలేఖరి దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించి సంబంధిత అధికారులు ప్రభుత్వ నిధులతో గుంతలు పూడ్చకపోతే ఆమె సొంత నిధులతో గుంతలకు మరమ్మత్తులు నిర్వహిస్తా మనడంతో దీనిపై ఈ నెల నాలుగో తేదీన విశాలాంధ్ర దినపత్రికలో ప్రముఖంగా వార్త ప్రచురించిన విషయం పాఠకులకు విధితమే. దీనిపై సంబంధిత శాఖఅధికారులు వెంటనే స్పందించి గతరెండు రోజులుగా రోడ్లపై గుంతులను కంకరతో పూడ్చుతు న్నారు. దీంతో ఈ ప్రాంతంలో ప్రయాణించే వాహనదారులు ప్రయాణికులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక మాఫియా, భూమాఫియాకు అడ్డుకట్టలేదు : టీడీపీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరులో ఇసుక మాఫియా, భూమాఫియాతో పాటు అసాంఘీక కార్యక లాపాలకు పోలీసులు అడ్డుకట్ట వేయలేక పోతున్నారని టీడీపీ ఇంచార్జ్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో ప్రవీణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తుంటే అడ్డుకున్న మహిళా ఎస్ఐ హైమావతిపై దాడి చేసిన వారిని ఇంతవరకు అదుపులోకి తీసుకోకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నాపై అక్రమకేసు పెట్టారని, నన్ను పట్టుకోవడానికి 6టీంలు పెట్టారని గుర్తుచేస్తూ మహిళా ఎస్ఐ దాడి చేసిన వారిని పట్టుకోవడానికి ఆ టీంలు పనిచేయడం లేదా అని ప్రశ్నించారు. దాడి చేసిన వారి వెనుక బిగ్‌బాస్ ఉండటంతో పోలీసులు పట్టు కోవడంలో వెనుకంజ వేస్తున్నారని అన్నా రు. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కౌన్సిలర్లు భోజనా నికి వెల్లారో లేక కౌన్సిలర్లకు విలువ ఇవ్వడం లేదని, కౌన్సిలర్‌లు ఏమన్నా పనిని కూడ చేసుకోవడం లేదని, ఆవేదన ఉన్నదా అని వైసీపీలోని ఎమ్మెల్యే గమనిం చడం లేదన్నా రు. అధికార పార్టీలో ఉన్న అంతర్గత విభేధాల గురించి ప్రొద్దుటూరులో చర్చనీయాంశం అయిందన్నారు. అంతర్గత విబేధాలు పత్రికలలో రాస్తే పత్రికల కార్యాలయం వద్ద, విలేకరులపై దూషణలు మానుకొని పార్టీలో ఉన్న విబేధాలపై దృష్టి సారిస్తే బాగుంటుందని ఎమ్మెల్యేకి సూచించారు.

సమస్యల పరిష్కారానికి టీడీపీకి అవకాశం ఇవ్వండి:పుట్టా

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండలంలోని గ్రామాల వారీగా ఉన్న ప్రజాసమస్యలు, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీకి అవకాశం ఇవ్వాలని మైదుకూరు నియోజికవర్గ టీడీపీ ఇంచార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని గొడ్లవీడు గ్రామంలో బాబుష్యూరి టి- భవిశ్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన గ్రామంలో పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని త్వరలో రాబోయే అసెంబ్లీ స్ధానాలు ఎన్నిక లు జరుగుతున్నాయని, తెలుగుదేశం పార్టీకి ప్రజలం దరి మద్దతు తెలిపి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసు కోవాలన్నారు. మన గ్రామాల్లో అభివృద్ధి జరగాలన్న, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్న టీడీపీని ఆదరించాలని అన్నారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అనివీతి అరా చకం ప్రశ్నిస్తే తప్పుడుకేసులు బనాయి స్తున్నారని, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ను, నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, మూడు నెలలు ఓపిక పట్టాలని బ్రహ్మంసాగర్ నీటిమట్టాన్ని పూర్తిస్ధాయిలో పడిపోయాయని, రాబోయే మార్చికి ఈ ప్రాంత ప్రజలకు పాగునీరు, త్రాగునీరుకు అవస్ధలు పడుతున్నా యని అన్నారు. ఇటివల కురిసిన తుఫాన్‌కు రైతులు పూర్తిస్ధాయిలో నష్టపోయారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు మిల్లు శ్రీనివాసులు,, స్ధానిక నాయకులు మాజీ సర్పంచ్ జయరామిరెడ్డి, సిద్ధారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వివేకానందరెడ్డి, వెంకటేశ్వర్లు, వీరబ్రహ్మం తో పాలు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధనరాసపల్లి అంకాలమ్మను దర్శించుకున్న చమర్తి

విశాలాంధ్ర -రాజంపేట: మండల కేంద్రంలోని కూచువారిపల్లి గ్రామపంచా యతీ ధనరాసపల్లి గ్రామ వాస్తవ్యులు ఆహ్వానం మేరకు హాజరైన రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు. ఆ ఊరి అమ్మవారైనా అంకాలమ్మ దేవతను దర్శించుకుని పూజలు చేయించి అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఆ గ్రామస్తులు చమర్తి జగన్ మోహన్ రాజును దృశ్యాలవాకప్పి పూలమాలవేసి ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం అధ్యక్షుడు శివ నారాయణ చౌదరి. శ్రవణ వారి పల్లి సర్పంచ్ కోటయ్య నాయుడు. మాజీ మండల అధ్యక్షుడు బాపనయ్య నాయుడు. రాజంపేట టిడిపి మాజీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు. టిడిపి మండల ఉపాధ్యక్షుడు సతీష్ రాజు. ముల్లగూరి మని. నాగినేని దివాకర్. మేడికొండ వెంకటేశ్వర్లు నాయుడు. రాజేష్. వినోద్ రెడ్డి. సూర్యనారాయణ రాజు. పలువురు గ్రామస్తులు నాయకులు అభిమానులు పాల్గొన్నారు.



భగవద్గీత పారాయణం

విశాలాంధ్ర-గాలివీడు: మండలకేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి అన్నమయ్య సర్కిల్ వద్ద వున్న శ్రీ కోదండ రామాలయంలో గాలివీడు ఆలయాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పవిత్ర మార్గశిర మాసం సందర్భంగా ప్రతిరోజూ భగవద్గీత పారాయణం సాయంత్రం 6:45 నుండి 7:45 వరకు జరుగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమం తిరుపతి ఇస్కాన్ దాస భక్తులచే నిర్వహించబడుతున్నదన్నారు. కావున పిల్లలు, పెద్దలు ప్రతీ ఒక్కరూ తప్పక ఈ పారాయణ మహాయజ్ఞంలో పాల్గొని ఆ శ్రీకృష్ణుని కృపకు పాత్రులు కాగలరని విజ్ఞప్తి చేశారు. మరింత సమాచారం కొరకు 6303536096 చారవాణిలో సంప్రదించాలని తెలిపారు.

వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీ కడప నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ వి ఎస్ అమీర్ బాబు, సీనియర్ నాయకులు ఆలంఖాన్ పల్లి లక్ష్మిరెడ్డిలు అన్నారు. ఆదివారం నగరంలోని అంగన్వాడి వర్కర్స్ 5 రోజులుగా చేస్తున్న ధర్నాకు సంఘీభావం తెలిపిన వారు కడప నగరంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు తెలుగుదేశం పార్టీ తరుపున సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బందికి పాదయాత్ర లో జగన్ ఇచ్చిన హామీతో పాటు సుప్రీంకోర్టు సూచించినట్లు గ్రాడ్యుటీని కనీస వేతనాలు అంగన్వాడీ వర్కర్లకు రూ. 26వేలు, హెల్పర్లకు రూ. 20వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలుపెంచేందుకుమాత్రం నిధులు లేవని చెప్పి ప్రభుత్వం ఇంటిపన్ను, కరెంటు చార్జీలు, చెత్త పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులు వివిధ రంగాల్లో పెంచిన డబ్బులు ఎక్కడికి పోయాయని జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం మొండివైఖరితో ఉందని, సమ్మెలో పాల్గొంటున్న వారిని చూసైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని హితవుపలికారు.బెదిరించి ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే మాత్రం పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే ఎన్నికల్లో అంగన్వాడీల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. అనంతరం అంగన్వాడి వర్కర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చమంటే నెరవేర్చలేదని పాదయాత్రలో తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్లో ఎక్కువ ఇస్తానని చెప్పి మోసం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకొండ మాజీ చైర్మన్ ఓబుల్ రెడ్డి, అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

తాళాలు పగల కొట్టిన దొంగలను అరెస్టు చేయాలి

అంగన్వాడి కార్యకర్తలు వినూత్న నిరసన

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు పగల గొట్టిన దొంగలను వెంటనే అరెస్ట్ చేయాలని అన్నమయ్య జిల్లా అంగన్వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు భాగ్యమ్మ తెలిపారు . ఆదివారం సంబేపల్లె తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియ జేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్క రించకుండా అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు పగలగొట్టిన ప్రభుత్వానికి త్వరలో బుద్ధి చెబుతామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తం గా అంగన్వాడీ కార్యకర్తలు ఈనెల 12వ తేదీ నుండి సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు .అంగన్వాడీ కార్యకర్తల న్యాయపరమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలియజేశారు .సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చక సచివాలయ సిబ్బందితో తాళాలు పగలగొట్టించడం ప్రభుత్వ పరాకాష్టకు నిదర్శనం అన్నారు. ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. దోపిడి రాజ్యం దొంగల ప్రభుత్వం అంటూ నినాదాలు చేస్తూ తాసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు మోకాళ్లపై నిలబడి విన్నూత్న నిరసన చేపట్టారు .ఈ కార్యక్రమంలో సంబేపల్లి మండల అంగన్వాడీ కార్యకర్తల సంగం అధ్యక్షురాలు అనసూయమ్మ, లక్ష్మీదేవి, పద్మజ , అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్న సుగవాసి ప్రసాద్ బాబు

విశాలాంధ్ర- రాయచోటిటౌన్: రాయచోటి పట్టణం గాలివీడు రోడ్ లక్ష్మీపురం లో గుత్తి కిషోర్ నూతన గృహప్రవేశ వేడుక ల్లో మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు, రాయచోటి నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా యజమానులకు ప్రసాద్బాబు శుభాకాంక్షలు తెలియజేశారు.

అంబేద్కర్ భవనాన్ని కాపాడండి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడపలోని రిమ్స్ వద్దగల వైఎస్సార్ క్రికెట్ స్టేడియం వద్దగల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్ స్టడీస సర్కిల్ నిర్మాణం గత 10సంవత్స రాలుగా నిర్మాణపనులు ఆగిపోయి అస్తవ్యస్తంగా మారిందని ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందన్నారు జిల్లా అధికారులు స్పందించి ఎంతో మందికి ఉపయోగపడే అంబేద్కర్ స్టడీ సర్కిల్ భవనాన్ని వాడుకలోకి తీసుకురావాలని పలు దళిత సంఘాలనాయకులు భవనాన్ని పరిశీలించి ఆవేదన వక్తంజే సారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్లక్ష్యం వల్ల భవనాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ కడప జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు ఆధ్వర్యంలో దళితనాయకుడు ఆధ్వర్యములో జరిగిన కార్యక్రమములో బాలదాసు మాట్లాడుతూ రాష్ట్రముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కడప నాగరకూడాళ్లకు వివిధ భివృద్ధికి 2152కోట్లు మంజూరు చేశారని అలాగే అంబేద్కర్ భవనం ప్రక్కనున్న వైయస్ అర్ క్రికెట్ స్టేడియంకు 50కోట్లతో అభివృద్ధి చేసినపుడు పక్కనేవున్న అంబేద్కర్ భవన నిర్మాణంకోసం నిధులు మంజూరు చేయక నిర్లక్ష్యం చేయదం దారుణమని తెపారు. అంబేద్కర్ మిషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్ సిపిఐ నగరకార్యదర్శి వెంకట శివ దళిత నాయకులు రెడ్డయ్య జె వి రమణ రిటైర్డ్ ఉద్యోగి సివి రమణ మాట్లాడుతూ అంబేద్కర్ భావన నిర్మాణం పనులు పట్లరాష్ట్ర ప్రభుత్వం తగినచర్యలు తీసుకోక పోవడం అంబేద్కర్ పట్ల ఏమాత్రం సిద్దశుద్ధి లేదనేది తేటతెల్లమైనదని తక్షణమే 5కోట్లు మంజూరు చేసి భావననిర్మాణం పూర్తిచేయాలనీ లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని తెలిపారు. భవనాన్ని పరిశీలించిన నాయకులు.కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లేస్సిపిఐ నగర కార్యదర్శి వెంకటశివ. యమార్పియస్ జిల్లా అధ్యక్షులు బీసీ గంగులు. సిపిఐ దళిత హక్కుల పోరాటసమితి నాయకులు ఓబయ్య మునేయ్య దళితనాయకులు వెంకటనాద రామాఅంజనేయులు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మిషన్ కార్యదర్శి బండి ప్రసాద్ మైనారిటి నాయకులు షేక్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర- చెన్నూరు : బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని మండలం లోని, ముండ్లపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ కమలాపురం నియోజకవర్గం ఇంచార్జ్ పుత్త నరసింహారెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం టిడిపి నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం అల్లాడు రాజశేఖర్ రెడ్డి, యామాల మణికంఠలు మాట్లాడుతూ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధిలో, సంక్షేమం రెండింటిలో ముందుకు వెళ్లాలని,మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మిని మానిఫెస్ట్ ద్వారా సూపర్ 6 పథకాలను ప్రకటించడం జరిగిందన్నారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కుటుంబాలు అభివృద్ధిలో పథంలో ముందు గుడు వెయ్యటానికి ఆ పథకాలను ప్రతీ కుటుంబానికి తెలియజేయడం జరుగుతుందని వారు తెలియజేశారు ,తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఉచితం, అన్నదాత పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి 20 వేల రూపాయల ఆర్థిక సాయం, యువగళం నిధి నెలకు 3 వేల రూపాయలు ఆర్థిక సాయం, అందించడమే కాకుండా బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి కుళాయి కనెక్షన్లు, ఐదేళ్లలో పేదల ఆదాయం రెట్టింపు పేదలను సంపన్నులు చేయటమే తెలుగుదేశం పార్టీ యొక్క లక్ష్యమని వారు తెలియ జేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు తోనే మన రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు అమలు కాగలవని వారు ఆశ భావం వ్యక్తం చేశారు, కావున మనం అందరం కలిసి, రాబోయే 150 రోజులు పార్టీ కోసం కష్టపడి చంద్ర బాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లాడు రాజశేఖర్ రెడ్డి ,యామల మణికంఠ, బుక్కన్న తిలక్, రవి, ముత్తిలిరయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై జగన్ రెడ్డి ఉక్కుపాదం

టిడిపి ప్రభుత్వ హయాంలోనే అంగన్వాడీలకు చేయూత: చమర్తి

విశాలాంధ్ర -రాజంపేట: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించమని కోరుతూ ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటం చేస్తున్న అంగన్వాడీలపై కక్షగట్టి జగన్ రెడ్డి ఉక్కుపాదం మోపడం పెట్టుబడిదారీ విధానాలకు నిదర్శనమని రాజంపేట పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో ఈ సందర్భంగా జగన్ మోహన్ రాజు తెలియ జేశారు. అసలు అంగన్వాడీలు చేసిన తప్పేంటి అని జగన్ మోహన్ రాజు ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. తనను మించిన మహిళా పక్షపాతి ఎవరూ లేరు అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు దంచి కొట్టే జగన్ రెడ్డికి అంగన్వాడీలపై నిర్భంధాలు చేయాల్సిన అవసరం ఏమొ చ్చిందని ప్రశ్నించారు.తెలంగాణ కంటే ఎక్కువ జీతాలు ఇస్తానని మాయ మాటలు చెప్పి తీరా అధికారంలోకి రాగానే మాట తప్పిన జగన్ రెడ్డికి అంగన్వాడీలు ప్రశ్నించడం తప్పేలా అవుతుంది జగన్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. జగన్ రెడ్డి మాత్రం నాడు నేడు కింద వేల కోట్లు ఖర్చుపెట్టి అంగన్వాడీ కేంద్రాలను ఆధునికరిస్తామని ఉదరగొట్టడంతోనే నాలుగున్నర ఏళ్ళు గడిపేసారన్నారు. 17,984 నూతన అంగన్వాడీ కేంద్రాలను నిర్మిస్తామన్న జగన్ రెడ్డి మాటలు బూటకంగానే మిగిలి పోయాయని జగన్మోహన్ రాజు ఎద్దేవ చేశారు. నవరత్నాల అమలుకు రూపొందించిన నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో నెలవారి కుటుంబాల ఆదాయం 10,000, పట్టణ ప్రాంతాల్లో 12,000 మించరాదు.ఈ నిబంధన వల్ల గ్రామీణ గిరిజన ప్రాంతాలలో 51,299 మంది అంగన్వానిలు పథకాల ఆర్థిక సహాయం కోల్పోతున్నారు అన్నారు అలాగే వారికి పింఛను అమ్మఒడి సాయం ఇళ్లపట్టాలు నిర్మాణంలో రాయితీలు అందడం లేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు.తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే తక్కువ బడ్జెట్ ఉన్నప్పటికీ అంగన్వాడీలకు జీతాలు పెంచి సంక్షేమం అందించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుం దన్నారు.అంతేకాకుండా అంగన్వాడీల డిమాండ్లకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమే చంద్రన్న ముఖ్య మంత్రి కాగానే అంగన్వాడీల డిమాండ్ల పరిష్కారానికి వారి సంక్షేమానికి పూర్తి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈకార్యక్రమంలో కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, సతీష్ రాజు, మోహన్ బాబు నాయుడు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలకు అనూహ్య స్పందన

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమయ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల నందు ఆదివారం భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగినది. ఈ పోటీలలో దాదాపు 300 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి చిన్మయ మిషన్ శ్రీమతి సుజనా గారు, కాలేజీ యాజమాన్యం పక్షాన శ్రీ సుధాకర్ రెడ్డి గారు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసి బహుమతి ప్రధానం చేశారు. గీతా జయంతి పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వెంకట సుబ్బారెడ్డి , దామోదర్ అమ్మ గారు, కొత్త నరసింహులు మూలే రామ ముని రెడ్డి , చెన్న రాయలు , వేమయ్య , మహేశ్వ రమ్మ, శ్రీదేవమ్మ వ్యవహరించినట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానము లు, కడప మరియు అన్నమయ్య జిల్లాల ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపీ తెలిపారు.

జగన్ రెడ్డి నిరంకుశ పాలనలో అన్ని వర్గాలకు నష్టం

విశాలాంధ్ర -రాజంపేట: జగన్ రెడ్డి నిరంకుశ పాలన వల్ల అన్ని వర్గాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. ఆదివారం రాజంపేట తెలుగు దేశం పార్టీ పార్లమెంట్ క్యాంప్ కార్యాలయంలో రాజంపేట పార్లమెంట్ సగర సాధికార కన్వీనర్ తాళ్లపాక వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన బీసీ "సగర సాధికార సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చమర్తి జగన్మోహన్ రాజు, జంపన వీర శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ, సగర కులాలు ఏదైనా అభివృద్ధి చెందాయి అంటే అది తెలుగుదేశం పార్టీ, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలోని న్యాయం జరిగిందన్నారు. జగన్మోహన్ రెడ్డి నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టి, నా మైనార్టీ అంటూనే మనల్ని అన్ని రంగాల్లో అణిచివేస్తున్నాడని, మన బీసీ కులాలన్నీ ఏకతాటిపైకి వచ్చి రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించడానికి ప్రతి ఒక్కరు సైనికుల వలే పోరాటం చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ సగర సాధికార మెంబర్స్ పి.రెడ్డి శివ, పి.నారాయణ, రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ గజ్జల గణేష్, రమణ, సుబ్రహ్మణ్యం, సురేష్, ఆనంద్, టి వెంకట రమణ, పి. మారేంద్ర, వెంకటసుబ్బయ్య, టి.కేశవ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై జగన్ రెడ్డి ఉక్కుపాదం తగదు : దొమ్మలపాటి ఆగ్రహం

విశాలాంధ్ర-మదనపల్లి :అంగన్వాడీల సమ్మెకు మదనపల్లి మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇంచార్జి దొమ్మలపాటి రమేష్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించమని ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటం చేస్తున్న అంగన్వాడిలపై కక్ష గట్టి ఉక్కు పాదం మోపడం జగన్ రెడ్డి నిరంకుశ, పెట్టుబడిదారీ విధానాలకు నిదర్శనమన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే మీ డిమాండ్లను పరిష్కరిస్తామని మా సంపూర్ణ మద్దతు మీకు ఇస్తున్నామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి నియోజకవర్గ యువనాయకులు దొమ్మలపాటి యశశ్వి రాజ్, దొమ్మలపాటి చాణక్య తేజ్, మండల అధ్యక్షులు దేవరింటి శ్రీనివాసులు, కత్తిలక్ష్మన్న, మేకల రెడ్డి శేకర్, రఘునాథ్ నాయుడు, మధుసూధన్ రెడ్డి, చల్లా శ్రీనివాసులు, కత్తి అరుణ్, కార్తిక్, చంద్రశేఖర్, సోమశేఖర్, ధాధు,తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పీలేరు డివిజన్లో పెన్షనర్ల జాతీయ దినోత్సవం

విశాలాంధ్ర-పీలేరు:పీలేరు డివిజన్లో ఘనంగా పెన్షనర్ల జాతీయ దినోత్సవంను పీలేరు డివిజన్ పెన్షనర్ల అధ్యక్షులు చంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగి పదవీ విరమణ అనంతరం వారి జీవనం గౌరవప్రదంగా సాగేందుకు ఉద్యోగులకు పెన్షన్ ప్రవేశపెట్టాలన్నారు. దానిని కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వాన్ని దేనిని అన్నారు పెన్షన్లు ఉద్యోగికి ఏమి భిక్ష కాదని అది హక్కు అని ఆనాడే సుప్రీంకోర్టు అమూల్యమైన తీర్పు ఇచ్చిందన్నారు. ఉద్యోగి పదవి విరమణ అనంతరం పెన్షన్తో వచ్చే గౌరవప్రదంగా తాను జీవించడానికి అనుకూలమైతుందన్నారు. వయస్సు పైపడే కొద్దీ ఆరోగ్య సమస్యలు ఎక్కువ అవుతాయని కుటుంబ బాధ్యతలు కూడా పెరుగుతాయని తెలిపారు. అందువల్ల డిఏలు సకాలంలో చెల్లించాలని బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ భాషా పీర్ నిత్యానంద రెడ్డి, రామచంద్రారెడ్డి భాస్కర్ రెడ్డి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొనగా వారిని సన్మానించారు అలాగే ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథులుగా పీలేరు ఎస్ టి ఓ భవ్య శ్రీ కుమారి పీలేరు సర్పంచ్, కో ఆప్షన్ సభ్యులు జీనత్ షఫీ, ప్రధాన కార్యదర్శి ఎర్రం రాజు కార్యాలయ బ్యానర్లు నరసింహారెడ్డి నాయుడు రాజశేఖర్ రెడ్డి జనార్ధన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎండి రాజశేఖర్ను కలిసిన క్రిస్టియన్ చైర్మన్ జాన్ బాబు

విశాలాంధ్ర-గుర్రంకొండ : విజయవాడ ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఎండి అమర రాజశేఖర విజయవాడ క్రిస్టియన్మైనార్టీ కార్పొరేషన్ ఆఫీస్లో అన్నమయ్య జిల్లా వైయస్సార్ పార్టీ అనుబంధ విభాగ చైర్మన్ బోనాసి జాన్ బాబు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. డిసెంబర్ 25వ తేదీన క్రిస్మస్ పండుగ సందర్భంగా జిల్లాలో ఉన్న పాస్టర్లకు గౌరవేతనం ఈ వారంలో ప్రభుత్వ నిధులు విడుదల చేయాలని కోరారు అలాగనే ప్రభుత్వం తరఫున నిర్వహిస్తున్న ఐటీ క్రిస్మస్ ప్రోగ్రాము అన్నమయ్య జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించాలని తేదీని ఖరారు చేయాలని ఆయన కోరారు. అన్నమయ్య జిల్లాలో ఉన్న క్రైస్తవ పాస్టర్లకు సంఘములకు వైయస్సార్ పార్టీ నాయకులకు ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరగబోతున్న ఐటి క్రిస్మస్ ప్రోగ్రాంకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు రాష్ట్రంలో జరగబోవు క్రిస్మస్ మరియు జిల్లాలో ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రిస్మస్కు క్రైస్తవులు రావాలని ఆయన కోరారు.

2024 ఎన్నికల్లో నల్లారి కిషోర్ గెలుపే లక్ష్యం

పీలేరు నియోజకవర్గంలో నల్లారి కుటుంబం సేవలు భేష్

రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ కార్య నిర్వాహక కార్యదర్శి కుప్పం రవిచంద్రారెడ్డి

విశాలాంధ్ర-పీలేరు:2024 ఎన్నికల్లో నల్లారి కిషోర్ గెలుపే లక్ష్యంగా టీడీపీ సైనికులు సన్నద్ధం కావాలని పీలేరు నియోజకవర్గంలో నల్లారి కుటుంబం సేవలు అమోఘమని.రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ కార్య నిర్వాహక కార్యదర్శి కుప్పం రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటలాడుతు గత30ఏళ్లుగా తండ్రికి తగ్గ తనయుడుగా అయన అడుగుజాడల్లో నడుస్తూ, అన్న చాటు తమ్ముడిగా ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఉన్నపటికీ నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దఎత్తున శ్రీకారం చుట్టిన నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సేవలు మరువలేనివన్నారు. తెలుగుదేశంపార్టీ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ కార్య నిర్వాహక కార్యదర్శి కుప్పం రవిచంద్రారెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలో రోడ్లు, భవనాలు, వంతెనలు,పాఠశాలలు, నిర్మించి ప్రజల మనసుల్లో చెరగని ముద్రలా చిరస్థాయిగా నిలిచారని అన్నారు.దారి వసతిలేని వారు తమ గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లాలంటే మరో మార్గంలేక తెప్పల్లో తిరుగుతుంటే చూచి, చలించి, యుద్ధ ప్రాతిపదికనగా వంతెనలు నిర్మించి వారధిగా నిలిచారన్నారు.నియోజకవర్గంలో ఏ కుటుంబానికి కష్టమొచ్చినా, నష్టమొచ్చినా నేనున్నానంటూ సమస్యకు పరిష్కారం చూపించి నిరంతరం ప్రజల్లో మమేకమై దారి చూపే దార్శకుడిగా ఉన్నారని ఆయన అన్నారు. చంద్రబాబు నాయుడు ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా కార్యక్రమాలకు వెళ్లిన కార్యకర్తలపై కావాలని, కక్షతో వైకాపా నాయకులు పీలేరు నియోజకవర్గ పరిధిలోఉన్న,తమ అభిమానులపై అక్రమ కేసులు నమోదు చేస్తే,వందల మందికి ముందస్తు బెయిల్ తీసుకొస్తూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకున్నారని అన్నారు. 2024 ఎన్నికల్లో అందరి సంక్షేమం,నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త ఒకసైనికుడిగా గ్రామ స్థాయి నుండి జనం మెచ్చిన నేత,నాయకుడు కిషోర్ కుమార్ రెడ్డి గెలుపుకు కృషి చేయాలన్నారు.

ఎర్రల కోసం వెళ్లి నీట మునిగిబాలుడి మృతి

విశాలాంధ్ర-మదనపల్లి : మదనపల్లి మండలం సిటీఎం చెంచులక్ష్మి కాలనీలో శనివారం అదృశ్యమైన బాలుడు ఆదివారం శవమై తెలాడు. ఎందుకు సంబంధించి మృతుని కుటుంబ సభ్యులు తాలూకా పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి మండలం చిన్న తిప్ప సముద్రం గ్రామం లోని చెంచు లక్ష్మీ కాలనీకి చెందిన నాగరాజు కుమారుడు ముకుంద తేజ(06) శనివారం స్థానికంగా ఉన్న ఓ చెరువుకు చేపల వేటకు వెళ్లేందుకు సహచరులతో కలిసి వెళ్ళాడు. కాలానికి సమీపంలో ఉన్న ఒక్కోనేటి వద్ద చేపల కోసం ఎర్రలను వెతికే క్రమంలో ప్రమాదవశాత్తు కోనేటి నీటిలో మునిగి గల్లంతయ్యాడు. ఆ సమయంలో సహచరులు ఎవరు గమనించకపోవడంతో బాలుడు నీట మునిగి మృత్యు వాత పడ్డాడు. అయితే బాలుడు ముకుంద తేజ అదృశ్యమై చీకటి పడ్డాక కూడా శనివారం రాత్రి ఇంటికి రాకపోవడంతో బాలుని తల్లిదండ్రులు మదనపల్లి తాలూకా పోలీసులను ఆశ్రయించి సిఐ ఎం.శేఖర్కు ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఐ బాలుని ఆచూకీ తెలపాలని వివిధ వాట్సాప్ గ్రూపు లలో బాలుని ఫొటోస్ ఫార్వర్డ్ చేశారు. అయితే ఆదివారం మధ్యాహ్నం చెంచులక్ష్మి కాలనీలోని కోనేటి నీటిలో ముకుంద తేజ మృతదేహం తెలడం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెళ్లి వెంటనే మృత దేహాన్ని వెలికి తీసి పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన సీఐ మృతదేహానికి పంచినామా నిర్వహించి పోస్టు మార్టం కోసం మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించి కేసు నమోదు అనంతరం దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-మదనపల్లి :కుటుంబ కలహాలతో ఇద్దరు మహిళలు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆదివారం మదనపల్లి జిల్లా ఆసుపత్రిలో చేరారు. ఇందుకు సంబంధించి ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కురబలకోటకు చెందిన మహబూబ్బాషా భార్య అమ్మాజీ (32) భర్తతో గొడవపడి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు గమనించి ఆమెను చికిత్స కోసం వెంటనే మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలుకుంటోంది. అలాగే భర్త రోజు ఇంటికి రావడం లేదన్న కోపంతో భర్తతో గొడవపడి ములకలచెరువుకు చెందిన చిరంజీవి భార్య కె శ్రావణి (23) వాస్మోల్ పాయిజన్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తల్లిదండ్రులు గమనించి బాధితురాలని చికిత్స నిమిత్తం 108లో హుటాహుటిన మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించారు. ఆమె పరిస్థితి విషమించడంతో వెంటనే ఆమెను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గాయత్రి తెలిపారు.

మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి

విశాలాంధ్ర-పీలేరు:మార్పు కావాలి-కాంగ్రెస్ రావాలి అనే నినాదంతో పీలేరు క్రాస్ రోడ్ నాలుగు రోడ్ల కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు మానవహారం నిర్వహించారు. విలేకరుల సమావేశంలో పీలేరు మండల అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.అభివృద్ధి కావాలన్నా సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలన్నా, ప్రత్యేక హొదా ఇవ్వాలన్న, కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని తెలిపారు.ఆంధ్రప్రదేశ్ తెలంగాణ కాంగ్రెస్ కి రెండు కళ్ళని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు నియోజకర్గ కన్వీనర్ రెడ్డి సాహెబ్,మండల అధ్యక్షులు శ్రీకాంత్, తంబళ్లపల్లె కన్వీనర్ సోమశేఖర రెడ్డి, మదనపల్లి కన్వీనర్ లీల శ్రీనివాస్,మదనపల్లి కాంగ్రెస్ నాయకులు రామచంద్ర, ఎన్ఎస్యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమృత్తేజ్, ఎన్ఎస్యుఐ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సంపత్,పీలేరు నియోజకర్గ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు పూర్తిగా వినియోగం

వెల్ విషర్స్ స్వచ్ఛంద సంస్థ స్థాపకులు గిరీష్ నల్లగుట్ల

విశాలాంధ్ర-మదనపల్లి :బెంగళూరుకు చెందిన సప్తగిరి ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ "వెల్ విషర్స్" ఆధ్వర్యంలో ఆదివారం కదిరి రోడ్డులోని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ ఆవరణంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు పూర్తిగా వినియోగించుకున్నారని గిరీష్ నల్లగుట్ల అన్నారు. గుండె, న్యూరో, కిడ్నీలో రాళ్లు, క్యాన్సర్, ఆర్థోపెటిక్ తదితర వ్యాధులకు సంబంధించిన డాక్టర్ల పలురకాలైన టెస్టులను నిర్వహించారు. ఇందులో 120 మంది వ్యాధిగ్రస్తులు పాల్గొని డాక్టర్ల సేవలను సద్వినియోగ పరుచుకున్నారు. సదరు వ్యాధిగ్రస్తులకు ఉచిత పరీక్ష చేయించడంతో పాటూ మందులను కూడా ఉచితముగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఇక్కడ సమస్యలు ఉన్న వ్యాధిగ్రస్తులను తమ బెంగళూరు ఆసుపత్రికి రెఫర్ చేశామన్నారు. వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితముగా వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ క్యాంప్ విజయానికి దోహదపడిన వెల్ విషర్స్ సంస్థ స్వచ్ఛంద సేవకులు సురేంద్ర, అరుణ్, కుమార్, జ్ఞానేంద్ర, హరి, అలీ, గోపి, రజియా, కుసుమ, లక్ష్మీపతి, శ్రేయస్, తయాబ్, మహేష్, హరీష్, గిరీష్, నరేష్, కిషోర్ తదితరులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

నల్లారి కిషోర్ వెంటే పులి సత్యనారాయణ రెడ్డి

కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు యువ గళం పాదయాత్ర ముగింపు

జైత్రయాత్ర విజయోత్సవ సభను జయప్రదం చేద్దాం

రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు పులి సత్యనారాయణ రెడ్డి

విశాలాంధ్ర-పీలేరు:పీలేరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి వెంటే రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు పులిసత్యనారాయణరెడ్డి ఉన్నారు. కొండైనా, బండైనా ప్రజలు తలుచుకుంటే పగలాల్సిందేనని,పీలేరు నియోజక వర్గంలో కిషోర్ కుమార్ రెడ్డికిప్రజలు పట్టంకట్టే సమయం ఆసన్నమైందని, తెలుగు దేశంపార్టీ రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు పులి సత్యనారాయణరెడ్డి తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి, యువతకు ఉద్యోగ అవకాశాలు,ప్రజా సమస్యల పరిష్కారం, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలకోసం నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో,తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి గెలుపు చారిత్రకమని అన్నారు. నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వంలో నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని,అక్రమ ఇసుకరవాణా, భూఆక్రమణలకు పాల్పడుతూ కల్తీ మద్యంతో కార్మికుల ప్రాణాలతో చేలాగాట మాడుతున్నారన్నారు.జగన్ రెడ్డి ప్రభుత్వంలో నాలుగున్నరేళ్లుగా ప్రతిపక్షాలపై దాడులు,కేసులపై ఉన్న శ్రద్ధ ప్రజా సంక్షేమంపై లేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి,ప్రజాసంక్షేమం పడకేసిందని అన్నారు.వచ్చే ఎన్నికల్లో ప్రజలు మార్పు తెచ్చే క్రమంలో ఒక స్పష్టతతో ఉన్నారని తెలిపారు. ఆ మార్పుతోనే వైకాపా ప్రభుత్వం సునామీలో కొట్టుకొపోవడం ఖాయమన్నారు.నియోజకవర్గంలో నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పిలుపు మేరకు,రాష్ట్రంలో పెను మార్పు తీసుకు వస్తూ సంచనలం సృష్టించిన మాజీమంత్రి, యువనేత నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర ఈ నెల20న విశాఖ పట్నంలో ముగింపు జైత్రయాత్ర విజయోత్సవ సభకు టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు,మహిళలు, అనుబంధ సంఘాలు, నల్లారి అభిమానులు పాల్గొని విజయ వంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బహుజనలకు రాజ్యాధికారమే బిఎస్పీ లక్ష్యం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : బహుజన సమాజ్ పార్టీ బద్వేల్ అసెంబ్లీ కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీ అధ్యక్షుడు గౌస్ పీర్ అధ్యక్షతన బహుజన రాజ్యాధికార చైతన్య సభ నిర్వహించడం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథులుగా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ ఆర్జే మలికల్ గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకి ప్రసాద్ హాజరై ముందుగా మహనీయుల చిత్రపటాలకు

పూలమాలను సత్కరించి వారు మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికామే లక్ష్యంగా బహుజన సమాజ్ పార్టీ కృషి చేస్తుందని అందుకు బహుజనులు అందరూ కలిసికట్టుగా బహుజన సమాజ్ పార్టీని బలపరచాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్వతంత్రం వచ్చినప్పుడు నుండి 75 సంవత్సరాలు 40 సంవత్సరాలు రెడ్లు మరో 25 సంవత్సరాలు కమ్మ అగ్రకుల సామాజిక వర్గానికి చెందినవారు ముఖ్యమంత్రులుగా అధికారం చేపట్టారన్నారు బహుజనలకు ఎటువంటి రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేయలేదని జనాభా ప్రాతిపదికన జనాభా సంఖ్యను బట్టి రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా కేవలం వాళ్లకు అనుచరులుగా మాత్రమే బహుజనులను వాడుకుంటున్నారని ఆరోపించారు రానున్న 2024 ఎన్నికల్లో బద్వేల్ నియోజకవర్గం లో బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిని ఏనుగు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించడం ద్వారా రాజ్యాధికారంలో బహుజనుల యొక్క ఆత్మగౌరాన్ని నిలబెట్టుకోవాలని బహుజనలకు వారు పిలుపునిచ్చారు. బహుజన సమాజ్ పార్టీ కడప జిల్లా ఇన్చార్జి మరియు బద్వేల్ సమన్వయకర్త సగిలి గుర్రప్ప జిల్లా అధ్యక్షులు డిఎస్ జయరాం వారు మాట్లాడుతూ మాన్యశ్రీ కాన్సిరాం గారు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఓటు హక్కు ద్వారా నా బడుగు బలహీన వర్గాల ప్రజలు రాజులవుతారని అంబేద్కర్ కన్నా కలలను సహకారం చేస్తూ మాన్యశ్రీ కాన్సిరాం గారు ఉత్తర ప్రదేశ్ లో బడుగు బలహీన వర్గాల ప్రజలను ఎమ్మెల్యేలను ఎంపీలను చేయడమే కాకుండా నాలుగు సార్లు దళిత శ్రీ అయినటువంటి బెహన్ కుమారి మాయావతి గారిని ముఖ్యమంత్రిని చేయడం ద్వారా రాజ్యాధికారానికి బహుజనులు ఎటువంటి వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని రుజువు చేయడం జరిగిందన్నారు కావున రానున్న ఎలక్షన్లలో తమ ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకునేలా ఏనుగు గుర్తుకు ఓటు వేసి కాన్సిరాం సార్ అంబేద్కర్ ఆలోచన విధానాలను అమలు చేయడం ద్వారా బడుగు బలహీన వర్గాల వారిని అసెంబ్లీకి పంపించే ఆలోచనతో ఏనుగు గుర్తు పై ఓటు వేసి బహుజన్ సమాజ్ పార్టీని అధికారంలోకి తీసుకో రావలసిన బాధ్యత మనందరిపై ఉందని వారు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బాలచంద్ర నెల్లూరు రూరల్ నియోజకవర్గం అధ్యక్షులు మురళి గారు మైదుకూరు అసెంబ్లీ అధ్యక్షులు నాగార్జున బద్వేల్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి ఏసోబు కోశాధికారి వినోద్ కుమార్ కార్యనిర్వక కార్యదర్శి రాజు పోరగాళ్ల మండల అధ్యక్షుడు సురేష్ కమలాపురం తాలూకా ఉపాధ్యక్షులు రామకృష్ణ పెద్ద ఎత్తున బద్వేల్ తాలూకా నుండి బహుజన సమాజ్ పార్టీ కార్యకర్తలుఅభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ప్రభుత్వానికి పట్టని అంగన్‌వాడీల సమస్యలు

విశాలాంధ్ర-రాయచోటి: అంగన్వాడీల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని రాయచోటి ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణ లో ని అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద అంగన్వాడీల సమ్మె ఆరవ రోజు కొనసాగింది. ఈ సమ్మెకు ప్రజాసంఘాల నేతలు హాజరై సమ్మెకు సంఘీభావం తెలిపారు. యం ఆర్ పీయస్ జాతీయ నాయకుడు యస్. రామాంజనేయులు ఓఫీడీఆర్ రాష్ట్ర సహాయక కార్యదర్శి టి. ఈశ్వర్. భారతీయ జనసేన అంబేద్కర్ జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పల్లం తాతయ్య రజకసంఘం రాయచోటి అధ్యక్షుడు టి. రమేష్ బాబు న్యాయవాది నాగముణి పామయ్య తదితరులు ధర్నా కు హాజరై ప్రసంగించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర లో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని పాలకుల విధానాల వలన ప్రభుత్వ పాఠశాలలు మూతపడేలా నూతనవిధ్యావిధానం తీసుకొచ్చారు నేడు అంగన్వాడీ వర్కర్ల కు జీతాలు పెంచుకుంటూ బిల్లులు ఇవ్వకుండా పస్తులు పెట్టి వేధించి తమంతట తామే ఉద్యోగం మానుకునేలా టార్చర్ చేయడమే ప్రభుత్వ విధానం అన్నారు. అంగన్వాడీలు సమ్మె నోటీసు ఇచ్చి శాంతియుతంగా ధర్నా లు చేస్తుంటే సచివాలయ ఉద్యోగుల చేత తాళాలు పగలకొట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు అంగన్వాడీ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి ఎ. అరుణ ప్రాజెక్టు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిద్దమ్మ భాగ్యలక్ష్మి ఐఎఫ్ టీయూ నాయకురాలు యస్ .మస్రూన్ బీ లు మాట్లాడుతూ ప్రభుత్వానికి లబ్దిదారుల మీద ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని ఉంటే 50 గ్రాముల కోడి గుడ్డుతో పాటు పురుగుల్లేని పౌష్టికాహారం పాలు సన్న బియ్యం ఇచ్చేవారనికానీ అంగన్వాడీ సెంటర్ల ప్రైవేటీకరణ చేయడానికి ప్రభుత్వం పూనుకొన్నదని అందుకే బడ్జెట్ పెంచకుండా చేస్తున్నదని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి పేద గర్భిణీ బాలింతలకు ఉపయోగపడే ఐసీడీయస్ ను కాపాడుకుందా మన్నారు. జీ తాలు పెంచే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సీనియర్ నాయకులు బంగారుపాప ఖాజాబీ పద్మజ సబీనా గౌసియా రాములమ్మ సునీత ,స్వప్న ,సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ఆకేపాటి పాదయాత్రకు ఎమ్మెల్యే ఘన స్వాగతం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ఉమ్మడి కడప జిల్లా పరిషత్ ఛైర్మన్ అకేపాటి అమర్ నాథ్ రెడ్డి చేపట్టిన 21వ తిరుమల మహ పాదయాత్ర సందర్భంగా ఆదివారం ఉదయం కోడూరు ప్రధాన కూడలి వద్ద కడప రేణిగుంట 716 నెంబర్ గల జాతీయ రహదారిలో జెడ్పి ఛైర్మన్ అమర్ నాథ్ రెడ్డి కి, కడప డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి కి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికి తిరుమల మహ పాదయాత్రలో పాల్గొని వారి వెంట నడిచారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిడి నాగేంద్ర యాదవ్, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, జడ్పిటిసి పాలెంకోట రత్నమ్మ, సర్పంచులు బుడిగి శివయ్య, ఉపసర్పంచ్ తోట శివసాయి, నాయని హరికృష్ణారెడ్డి, కోటగుండ్ల గోపి, దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు,దార్ల చంద్రశేఖర్, ఆనాల చంగల్ రెడ్డి,రమేష్ వర్మ,మాజీ జెడ్పిటిసి బండారు సుబద్రమ్మ,కసరం అరుణ,పట్టణ అధ్యక్షులు సిహెచ్ రమేష్ బాబు, కంపరాజు నాగేంద్రరాజు, కొన్నిపాటి ప్రసాద్,నూక మహేశ్వర్ రెడ్డి, రౌఫ్, ఆంజనేయులు, కొప్పల శంకరయ్య, దామర్ల శిద్దయ్య డివి రమణ భూంపల్లి నాగరాజు మల్లు కృష్ణారెడ్డి కంచర్ల రమణారెడ్డి,గల్లా శ్రీనివాసులు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

ఘనంగా శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి బర్సీ

విశాలాంధ్ర - కమలాపురం : స్థానిక పెద్ద దర్గా -ఏ-గఫారి యాలో శ్రీ హజ రత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి బర్సీ మహెూత్సవాన్ని ఘనంగా. ఆదివారం పీఠాధిపతులు నిర్వహించారు. పీఠాధిపతి సజ్జాదె నషీన్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో భక్తుల నడుమునబర్సీ మహెూత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని గంధం నివాసం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన పూల చాందిని లో పవిత్రమైన గంధం ఊరేగింపుగా కమలాపురం పెద్ద దర్గా మార్గం మధ్యలో బాణా సంచా పెద్ద పెద్ద ధ్వనిలో డబ్బు వాయిదాల నడుమున ఊరేగింపులో యువకులు వివిధ రకాల నృత్యాలు చేశారు. ఊరేగింపు జరగ చేరుకున్న అనంతరం భక్తులకు పీఠాధిపతి ఆధ్వర్యంలో స్వామి వారి మజర్లపై పూలచంద్రులు సమర్పించారు గంధం ఎక్కించారు. ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు నిర్వాహకులు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరి స్వామి మౌలానా స్వామి గౌస్ పాక్ జియా మైనార్టీ యువ నాయకుడు ఇస్మాయిల్ సర్వరా జ్ మత పెద్దలు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు -ఆర్థిక మలుపు

విశాలాంధ్ర-పీలేరు: విద్యుత్ పొదుపు. ఆర్థిక మలుపు. కరెంట్‌నుఆదా చేస్తే రాష్ట్ర, దేశ అభివృద్ధికి తోడ్పాటు అందించినవారమవుతాం' అని పీలేరుపట్టణఏ.పీ.ఎస్.పి.డి.సి.ఎల్ అసిస్టెంట్ఇంజనీర్(పట్టణ) పురుషోత్తం అన్నారు. ఏ.పి.ఎస్.పి.డి.సి.ఎల్ సంస్థ ఈ నెల 14 నుంచి 21 వరకు విద్యుత్ పొదుపు వారోత్సవాల సందర్భంగా ఏ.పి.ఎస్.పి.డి.సి.ఎల్, పీలేరు పట్టణ అసిస్టెంట్ ఇంజనీర్(పట్టణ) పురుషోత్తం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుండి తిరుపతి రోడ్డులోని ఏ.పి.ఎస్.పి. డి.సి.ఎల్ డివిజన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో చిరంజీవి బుర్రకథ నాట్యమండలి వారిచే విద్యుత్ పొదుపు పై గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా ఏ.ఈ పురుషోత్తం మాట్లాడుతూ విద్యుత్‌ను అనవసరంగా ఖర్చు చేయవద్దని, గదుల్లో సహజ సిద్ధంగా వెలుతురు ప్రసరించేలా చూసుకోవాలని, అన్ని కిటికీలు తెరిచి ఉంచాలని, అన్ని కేటగిరీలకు చెందిన వినియోగ దారులు విద్యుత్‌ను పొదుపుగా వాడాలని సూచించారు. అవసరానికి మాత్రమే విద్యుత్‌ను ఉపయోగించాలి. గదులలో వ్యక్తులు లేని సమయంలో లైట్లు, ఫ్యాన్లు ఆర్పివేయాలి. ఎల్ఈడీ బల్బులు మాత్రమే వాడాలి. 5 స్టార్ రేటింగ్ ఉన్న విద్యుత్ పరికరాలు వాడాలి. ఫ్రిడ్జ్ డోర్‌ను తెరిచి ఉంచరాదు. అవసరమైనప్పుడు మాత్రమే ఫ్రిడ్జ్ డోర్ తెరిచి, తిరిగి వెంటనే మూసి ఉంచినట్లయితే విద్యుత్ ఆదా అవుతుంది. ఇండ్లలో నీటిని వేడి చేయడానికి ఇమ్మర్షన్ వాటర్ హీటర్లు వాడొద్దు. వాటి ద్వారా బిల్లు అధికంగా వస్తుంది. సోలార్ పవర్ ప్లేట్లను, బిల్డింగ్ పైన ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేసుకుని సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకుని సోలార్ నెట్ మీటర్ ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చు. విద్యుత్ పొదుపు కోసం ఎల్ఇడీ బల్బులు, ట్యూబ్‌లు తప్పనిసరిగా వాడాలి. ఫోకస్‌లైట్లు, హాలోజన్ బల్బులు అధిక విద్యుత్‌ను వినియోగిస్తాయి. కావున తప్పని సరిగా ఎల్ఇడీ బల్బులు మాత్రమే వాడాలి. అన్ని కార్యాలయాల్లో కూడా అవసరానికి తగినట్లుగా లైట్లు, ఫ్యాన్లు వాడాలి. అవసరం లేనప్పుడు పరికరాలు, స్విచ్‌లు, లైట్లు, ఆఫ్ చేయాలి. సిబ్బంది అందరూ విద్యుత్ దుబారాను ఆరికట్టాలి. అన్ని రకాల మోటార్లకు తప్పని సరిగా కెపాసిటర్‌లు వాడినట్ల యితే విద్యుత్ పొదుపు చేయవచ్చు. కరెంట్ బిల్లులు తగ్గించవచ్చు. అన్ని ప్రదేశాల్లో ఎల్ఈడీ బల్బులు మాత్రమే వాడాలి. హెూలోజన్ బల్బుల స్థానంలో ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు వాడి విద్యుత్ పొదుపు చేయాలి. సహజ సిద్ధంగా వెలుతురు వచ్చేట్లుగా షెడ్‌పై భాగంలో గ్లాస్‌టాప్‌లు ఏర్పాటు చేసుకోవాలి. కిటికీలన్నీ తెరిచి ఉంచాలి. అన్ని రకాల విద్యుత్ మోటార్లకు తప్పని సరిగా అవసరమైన కెపాసిటర్లు ఏర్పాటు చేసుకుంటే మోటార్లు, స్టార్టర్లు కాలి పోకుండా కాపాడుకోవచ్చు. అలాగే దగ్గరలో ట్రాన్స్‌ఫార్మర్లు, సంబంధిత విద్యుత్ లైన్‌లపై భారం పడకుండా కాపాడవచ్చు. విద్యుత్‌తో పాటు నీటి దుబారాను ఆరికట్టడానికి ఆటోస్టార్టర్లను తప్పని సరిగా తొలగించాలి. పై సూచలన్నింటిని పాటిం చి, విద్యుత్‌ను పొదుపు చేయాలని చెప్పారు. పై కార్యక్రమంలో ఏఈ పురుషోత్తం తోపాటు లైన్ ఇన్స్పెక్టర్ రవికుమార్, లైన్ మ్యాన్ లు శ్రీరాములు, భాస్కర్, గంగయ్య, మధు, సిబ్బంది, కళాకారులు చిరంజీవి, వరప్రసాద్, రమణబాబు పాల్గొన్నారు.

శ్రీవారికి పుష్పాభిషేకం

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణంలో వెలసిన శ్రీపద్మావతి సమేత వెంకటరమణ స్వామి ఆలయంలో ఆదివారం పుష్పాభిషేకం నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని శ్రీవారిని పుష్పాలతో అలంకరించారు. బహుశా బోగి పండుగ ముగిసే వరకు ధనుర్మాసం ఉంటుందని అర్చకులు తెలిపారు. ధనుర్మాసం అంటే శ్రీమహావిష్ణువుకు ఇష్టం. కావున ధనుర్మాసం పూర్తయ్యే లోపు అటు శ్రీరంగనాథస్వామి ఇటు శ్రీవారికి బ్రహ్మోత్సవాలు కూడా నిర్వహిస్తారు. త్వరలో వైకుంఠ ఏకాదశి పర్వదినం రానుంది. ఈ క్రమంలో శ్రీరంగనాథ స్వామి వారిని ఉత్తర ద్వారా దర్శనం ద్వారా దర్శించుకుంటే పుణ్యఫలాలు లభిస్తాయని భక్తుల నమ్మకం. మార్గశిర మాసంలో శ్రీమహావిష్ణువుకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తే సకల దోషాలు తొలగి సంపదలు లభిస్తాయని భక్తులు చెబుతున్నారు. ఏమైనప్పటికి ధనుర్మాసనం రోజున శ్రీవారు పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

విశాలాంధ్ర- బద్వేల్ : కలసపాడు మండలం లోని ఎగువ రామాపురంలో ఆదివారము వైద్య శిబిరం నిర్వహిం చడం జరిగింది. ఈ వైద్యశిబిరం నందు ఎముకలు, కీళ్ళు, జనరల్ మెడిసిన్, చిన్న పిల్లల, కంటి, దంత, ఫిజియోథెరపీ మొదలగు వైద్య విభాగాల నిపుణులు 450 మంది రోగులను పరీక్షించారు. 250 మందికి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించారు. అందరికి ఉచితంగా మందులు పంపిణి చేయడము జరిగింది. చుట్టు ప్రక్కల 8 మారుమూల గ్రామాల ప్రజలు ఈ వైద్యశిబిరంలో సేవలు పొందారు. ఇందులో 60 మందికి కంటి శుక్ల ఆపరేషన్లకు రెఫర్ చేయడము జరిగింది. ఎగువ రామాపురం గ్రామప్రజలు తమ గ్రామం నందు మొట్టమొదటి సారిగా పెద్ద వైద్యశిబిరాన్ని నిర్వహించడాన్ని గుర్తించి డా.రాజ శేఖర్‌ను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా డా. రాజశేఖర్ మాట్లాడుతూ అత్యంత వెనుక బడిన బద్వేల్ నియోజకవర్గ మూరుమూల గ్రా మములందు ప్రజలకోసం ఉచిత శిబిరాలను నిర్వహించాలని, అన్ని విభాగాల వైద్య సేవలు డాక్టర్లచే మూరుముల గ్రామా లందు ప్రజలకు వైద్యసేవలు అందించి పెద్ద ఆసుపత్రుల యందు చికిత్సను అందించడం లక్ష్యంగా, బద్వేల్ నియోజకవర్గంలోని ప్రతి మండలాలలో ఏర్పాటు చేస్తాను అని ఈ వైద్యశిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బకాయిలు చెల్లించేవరకు దీక్షలు ఆగవు



విశాలాంధ్ర -సుండుపల్లె : అంగన్వాడీల న్యాయ బద్ధమైన డిమాండ్ లను పరిష్కరిం చాలని రాష్ట్రవ్యాప్త నిర్వాదిక సమ్మెలో భాగంగా సుండుపల్లె పట్టణ కేంద్రంలో ఆరవ రోజు వినూత్న రీతిలో అంగన్వాడీ వర్కర్లు గద్దె చెబుతూ నిరసన చేశారు.ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ వెల్ఫర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి కో కన్వీనర్ సరోజమ్మ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల పట్ల రాక్షసంగా ప్రవర్తిస్తుందని, అంగన్వాడి సెంటర్లను బద్దలు కొట్టి కార్యకర్తలను భయభ్రాంతులను గురి చేయడం దౌర్భాగ్యం అని.. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి సమాన పనికి సమాన వేతనం ఇచ్చి గ్రాటిటూడిని అమలు చేయాలని డిమాండ్ ను పరిష్కరించేంత వరకు నిరవధిక సమ్మె ఆగదని వివిధ రూపాలలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల అధ్యక్షులు సంధ్య, సిఐటియు నాయకులు నాగరాజు అమ్మ, ఏఐటీయూసీ నాయకులు శివకల రెడ్డమ్మ, భారతి, రామ, తులసి, తదితరులు పాల్గొన్నారు.

గత వైభవాన్ని తలపించేలా 'మహాసభలు'

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కడపజిల్లాలో గతంలో నిర్వహించిన మహాసభల వైభవాన్ని తలపించేలా 36 ఏళ్ల తరువాత డిసెంబర్,23,24 తేదీలలో కడప సభాభవనంలో వైయస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో మహాసభలు నిర్వహించనున్నట్లు సంఘం గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్ సత్యాగ్ని అన్నారు. ఆదివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో వైయస్సార్ జిల్లా రచయితల సంఘం కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించబడింది. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్ సత్యాగ్ని మాట్లాడుతూ గతంలో మహా సభలు నిర్వహించినప్పుడు ఇతర ప్రాంతాల నుండి మహాకవులను, రచయితలను కడప గడపకు ఆహ్వానించారని ఆ వైభవాన్ని పునరావృతం చేసేలా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రాచీన కవులు మొదలుకొని ఆధునిక కవుల వరకు తెలుగు భాషా సాహిత్యాలకు కడపజిల్లా ఎనలేని సేవ చేసిందని, తొలి శాసనం, తొలి ప్రబంధకర్త, పోతులూరి వీరబ్రహ్మం, వేమన వంటి మహామహులు పుట్టిన గడ్డ కడప అని అన్నారు. వైయస్సార్‌జిల్లా చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, కళల వైభవాన్ని యువతకు చేరువ చేయాలనే సంకల్పంతో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యవర్గ సభ్యులం తా కలసి మహాసభల ఆహ్వాన పత్రకలను ఆవిష్కరించారు. అనం తరం డా.వెల్లాల వెంకటేశ్వరాచారి రచించిన, సోమిశెట్టి సరళ గానం చేసిన, బాబ్ స్టూడియో సంగీత సహకారంతో రూపొందించిన కడప వైభవాన్ని చాటే ఉద్దీపనగీతాన్ని కార్యవర్గ సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు అలపర్తి పిచ్చయ్య చౌదరి, కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు డా.చింతకుంట శివారెడ్డి, కోశాధికారి డా.కొప్పోలు రెడ్డి శేఖరరెడ్డి, కార్యవర్గ సభ్యులు డా.వెల్లాల వెంకటేశ్వరాచారి, డా.పాలెం వేణుగోపాల్, డా.జి.వి.సాయి ప్రసాద్, డా.అనుగూరు చంద్రశేఖరరెడ్డి, భూమిరెడ్డి స్వరూపరాణి, డా.ఎస్.రాజగోపాలరెడ్డి, డా.సురేష్ బాబు, డా.పొదిలి నాగరాజు, డా.కోడూరు స్వతంత్రబాబు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో వైకాపా పటిష్టంగా ఉంది: ఎమ్మెల్యే రాచమల్లు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: జిల్లాలో పులివెందుల తరువాత ప్రొద్దుటూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత బలంగాను, పటిష్టంగాను ఉన్నదని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఇటివల వైకాపా కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాష కౌన్సిలర్లకు విందుభోజనం ఏర్పాటుచేయడంతో రెండు పత్రికలలో రాచమల్లు కోటకు బీటలు అంటూ, పార్టీలో అసమ్మతి కౌన్సిలర్లు అంటూ కథనాలు రాశారని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి లేదని, అంతా ఒకే తాటిపై ఒకే మాటపై ఉన్నారని అన్నారు. ప్రొద్దుటూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నేనే అని అన్నారు. తెలుగుదేశం పార్టీలో నలుగురు అభ్యర్థులు పోటిపడుతున్నారని, ఎవరికి టికెట్ ఇస్తారో టీడీపీ వారు చెప్పలేదని అన్నారు. ఇప్పటికే ప్రొద్దుటూ రులో టీడీపీ టికెట్టు కొండారెడ్డికి అని, ప్రవీణ్ కుమార్ రెడ్డికి అని జోరుగా పందేలు జరుగుతున్నాయని అన్నారు. ప్రొద్దుటూ రును అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని నేను కృషి చేస్తుంటే టీడీపీ వారు విమర్శలవైపు చేస్తూన్నారని, నియోజికవర్గ ప్రజల చూపు ఫ్యాను గుర్తుపై ఉంద న్నారు. ఈ సమా వేశంలో పోరెడ్డి నరసింహారెడ్డి, కాకర్ల నాగశేశారెడ్డి, వరి కూటి ఓబుల్‌రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

రఘునాథరెడ్డికి విశిష్ట పురస్కారం

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందులకు చెందిన వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డికి విశిష్ట సురస్కారం లభించింది. విజయవాడలోని తాడేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయ ఆవరణలో వైయస్సార్సీపి దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమం సందర్భంగా రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున కొంతమంది నాయకులకు ప్రముఖుల చేతులమీదుగా ఘనంగా సన్మానం చేసి, విశిష్ట పురస్కారాలు అందజేశారు. వైయస్సార్ జిల్లా పులివెందుల నియోజక వర్గంలో వికలాంగుల సంక్షేమంకోసం గత మూడుదశాబ్దాలుగా కృషిచేస్తున్న ఏపీ దివ్యాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి చేసిన సేవలకు గుర్తింపుగా రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన దివ్యాంగుల సమక్షంలో శాసనమండలి సభ్యు రాలు పోతుల సునీత చేతులమీదుగా దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, విశిష్ట పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ వికలాంగుల విభాగం రాష్ట్రఅధ్యక్షులు బందెల కిరణ్ రాజ్ , వైయస్సార్సీపి గ్రీవెన్స్ సెల్ విభాగం రాష్ట్ర చైర్మన్ అంకంరాజు నారాయణమూర్తి, వైయస్సార్సీపి రైతువిభాగం అధ్యక్షులు నాగిరెడ్డి , మహిళా విభాగం అధ్యక్షురాలు గీత, వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన వైసీపీ వికలాంగుల విభాగం అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

మోడీ పాలనలో ప్రమాదంలో భారతదేశం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : అసమర్ధ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ పాలనలో భారతదేశం పెను ప్రమాదంలో పడిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజమెత్తారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఈవీఎంల అంకెల గారడీతో అధికారం చాలా ఇస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం లౌకికవాదం శాంతి భద్రతలు మతసామరస్యం సోదర భావం వంటి అత్యున్నత భారత రాజ్యాంగ విలువలను అనునిత్యం ఖూనీ చేస్తూ మత విద్వేష పరిపాలన కొనసాగిస్తుందని విమర్శించారు. ఇటీవల లోక్సభలో కొందరు వ్యక్తులు జొరబడి, దేశ అత్యున్నత చట్టసభల విధులకు భంగం కలిగించడమే కాకుండా సభ్యులను భయభ్రాంతులకు గురి చేయడం శోచనీయమన్నారు. పార్లమెంటు భద్రతా వలయాన్ని ఛేదించి అగంతకులు లోనికి ప్రవేశించి అలజడి సృష్టించడాన్ని తీవ్రంగాఖండిస్తున్నామన్నారు. ఈ అమానుష ఘటన జరిగిన రోజు నుండి ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర హెూంమంత్రి అమిత్ షా సభలకు హాజరు కాకుండా ప్రభుత్వం నుండి దేశభద్రత పార్లమెంటు భద్రతపై సమాధా నం చెప్పకుండా తప్పించుకు తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఇలాంటి పిరికి పాలకులు దేశానికి అవసరం లేదన్నారు. అయోధ్యలో రామాలయం పేరిట ప్రజలను మభ్యపెడుతూ వచ్చే లోక్సభ సార్వ సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి గెలుపొం దేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. దుర్మార్గపు పరిపాలన కొనసాగిస్తున్న ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగమైన బిజెపి ప్రభుత్వాన్ని ప్రజలు బంగాళాఖాతంలో కలిపే సమయం ఆసన్నమైందన్నారు. ఈ సమావేశంలో పిసిసి కార్యదర్శి మోపూరి వెంకటరమణారెడ్డి, మాజీ కార్పొరేటర్ రహమతుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జికు ఘన నివాళి

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: అంగన్వాడి సమ్మెలో ఉన్న అంగన్వా డీలు రెండు రోజుల క్రితం అంగన్వాడి సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలిపి తిరిగి వస్తున్న నేపథ్యంలో కారు ప్రమాదంతో మరణించిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జికు మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు ఘననివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాహుల్, సీపీఎం మం డల నాయకులు భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కరానికి కృషి

విశాలాంధ్ర -మైలవరం : ప్రజా సమస్యల పరిస్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని మండల అధ్యక్షురాలు దంపతులు చెరెడ్డి సావిత్రి, చెన్న కేశవ రెడ్డి లు తెలిపారు. ఆదివారం సాయంత్రం విశాలాంధ్ర తో మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలోని పేద, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారి సమస్యల పరిష్కారం కోసం వారి సమస్యలను పరిష్కరిస్తూ వారి సంక్షేమ కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఎల్లవేళలా వారికి అందుబాటులో ఉన్నామని పేర్కొన్నారు. నవరత్నాలు కార్యక్రమం లోని పథకాలు ఇంకా అర్హులైన వారికి అందుకుంటే గ్రామ సచివాలయం లలో దరఖాస్తు చేసుకోవాలని లేదంటే మండల కేంద్రములో వున్నా అధ్యక్షురా లు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కార్యక్రమం విజయవంతం చేసిన వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు ముఖ్యంగా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

రిమ్స్ స్టేషన్ తనిఖీ

విశాలాంధ్ర -కడప : నగరంలోని రిమ్స్ పోలీస్ స్టేషన్ ను కడప డి.ఎస్పీ ఎం.డి షరీఫ్ ఆదివారం వార్షిక తనిఖీ నిర్వహించారు. పరిసరాలు పరిశీలించారు. ఆవరణలో పచ్చదనం పెంపొందించాలని, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని రిమ్స్ పి.ఎస్ సి.ఐ కె. రామచంద్ర కు సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. దొంగతనాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 'దిశ' రిసెప్షన్ సెంటర్ ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నియంత్రణ కు చర్యలు తీసుకోవాలని, వాహనదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.